## శాంతియుత నిరసనలపై పోలీసు కేసులా..?

**-ఖమ్మం పోలీసుల అత్యుత్సాహం**
**-సిపిఐ జిల్లా సమితి ఆరోపణ**

**ప్రజాపక్షం/ ఖమ్మం :** శాంతియుతంగా తమ నిరసనను లేదా డిమాండ్స్‌ను ప్రభుత్వానికి తెలియజేస్తే పోలీసులు కేసులు నమోదు చేయడం ఆక్షేపణీయమని భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ఖమ్మం జిల్లా సమితి తెలిపింది. సిపిఐ జిల్లా సమితి పక్షాన జిల్లా కార్యదర్శి దండి సురేష్ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో శాంతియుతంగా కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేయడం జరిగిందని ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరామని ఈ సందర్భంగా ప్రజలకు కానీ అధికార కార్యక్రమాలకు కానీ ఎటువంటి అంతరాయం కలిగించ లేదని సురేష్ తెలిపారు. ఆందోళన చేస్తున్న సమయంలో కలెక్టరేట్‌కు వచ్చిపోయే సామాన్య ప్రజలకు, అధికారులకు, ట్రాఫిక్‌కు ఎటువంటి ఆటంకం కలిగించలేదని కలెక్టరేట్ ఎదుట గల రెండు గేట్లలో ఒక గేటు తీసే ఉన్నా తమ కార్యకర్తలు ఎవరు లోపలికి వెళ్లే ప్రయత్నం కూడా చేయలేదన్నారు. రాష్ట్ర పిలుపు కావడం, పోలీస్ అధికారులు తమ నాయకత్వాన్ని కార్యక్రమ సమాచారం అడిగినప్పుడు వివరాలు తెలపడంతో పాటు శాంతియుతంగా కార్యక్రమాన్ని

మిగతా 2లో..

www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
బుధవారం | 10 | సెప్టెంబర్ | 2025
పేజీలు : 8

# ప్రజా ఉద్యమ దిక్సూచి సురవరం



**-వందేళ్ల పోరాట నవ యవ్వని సిపిఐ**
**-ప్రజా ఉద్యమ నిర్మాణమే సురవరానికి సరైన నివాళి**
**-సురవరం సంస్మరణ సభలో అఖిలపక్ష నేతలు**



**ప్రజాపక్షం/ భద్రాద్రి కొత్తగూడెం :** 65 ఏళ్ల ప్రజా జీవితంలో ఎన్నో ఉద్యమాలకు నేతృత్వం వహించి చారిత్రిక ఉద్యమ విజయాలను చవిచూసిన సురవరం సుధాకర్ రెడ్డి ప్రజా ఉద్యమ దిక్సూచి అని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు తెలిపారు. విద్యార్థి దశ నుంచే ధిక్కార స్వరంతో తన ప్రస్థానాన్ని ప్రారంభించిన సురవరం అంచలంచెలుగా ఎదిగి కమ్యూనిస్టు పార్టీలో అత్యున్నత స్థాయికి చేరారని ఆయన జీవితం ఎందరికో ఆదర్శమని ఆయన స్ఫూర్తి భవిష్యత్తు ఉద్యమానికి ప్రేరణ అని ఆయన తెలిపారు. ఇటీవల మరణించిన సిపిఐ జాతీయ సమితి మాజీ ప్రధాన కార్యదర్శి , మాజీ ఎంపి సురవరం

మిగతా 2లో..

## ముగ్గురు కార్మికులు మృతి

**ప్రజాపక్షం/చర్ల :** మండల పరిధిలోని ఉంజుపల్లి గ్రామం వద్ద నిర్మాణంలో ఉన్న మిషన్ భగీరద వాటర్ ట్యాంక్‌లో సెంట్రింగ్ సరిచేసే నిమిత్తం దిగిన ముగ్గురు కార్మికులు మృతి చెందారు. మొదట దిగిన కూలీ ఊపిరాడక అపస్మారక స్థితిలోకి వెళ్లగా అతన్ని కాపాడేందుకు వెళ్లిన మరో ముగ్గురు కూలీల్లో ఇద్దరు కూడా మృతి చెందారు. వారిని చర్ల ప్రభుత్వాస్పత్రికి తరలించగా ఇద్దరి మృతి చెందగా, మరో ఇద్దర్ని భద్రాచలం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వారిలో ఒకరు చికిత్స పొందుతూ మృతి చెందారు. మృత చెందిన వారిలో కాకా మహేష్, నీలం తులసీ రామ్, ఏపిలోని చోడవరంకు చెందిన మరో వ్యక్తి ఉన్నారు. సిఐ రాజు వర్మ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు దుర్మరణం



**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :** మండల పరిధిలోని తక్కెళ్లపాడు గ్రామ సమీపంలో లారీ ఢీకొని బైక్‌పై వెళ్తున్న భార్యాభర్తలు మృతి చెందిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మృతు లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల మండలం గనిఆత్కూర్ గ్రామానికి చెందిన దామినేని శ్రీనివాసరావు(54), దామినేని రజినికుమారి(50)లు తక్కెళ్లపాడు నుండి బైక్ మీద మొలుగుమాడు వైపు వెళ్తున్న క్రమంలో అదుపు తప్పి ఎదురుగా వస్తున్న లారీని ఢీకొనడంతో భార్యాభర్తలు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. శ్రీనివాసరావు దంపతులకు ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను మధిర ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమేష్ కుమార్ తెలిపారు.

## నేడు ఎస్‌కెఎం ఆధ్వర్యంలో రైతు సదస్సు

**ప్రజాపక్షం/ ఖమ్మం :** వ్యవసాయ రంగ సమస్యల పరిష్కారం కోరుతూ సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో వామపక్ష రైతు సంఘాల నేతృత్వంలో రైతు సదస్సును నిర్వహించనున్నారు. రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో బుధవారం ఉదయం 10 గంటలకు జరిగే ఈ రైతు సదస్సులో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు బాగం హేమంతరావు, పర్స పద్మ, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర నాయకులు పోతినేని సుదర్శన్, వివిధ రైతు సంఘాల నాయకులు కెచ్చల రంగయ్య, కోటేశ్వరరావు తదితరులు హాజరవుతారని రైతు సంఘాల నేతలు తెలిపారు. పత్తిపై దిగుమతి సుంకం రద్దును తక్షణం ఉపసంహరించుకోవాలని, వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించాలని, వ్యవసాయ రంగ సమస్యలకు పరిష్కారం చూపాలన్న తదితర డిమాండ్స్‌తో సదస్సు నిర్వహించనున్నట్లు నిర్వహకులు తెలిపారు.

## మౌలిక వసతుల కల్పనతో పెరగనున్న జీవన ప్రమాణాలు

శంకుస్థాపన కార్యక్రమంలో డిప్యూటీ సిఎం భట్టి



2 లో

## అర్హులందరికీ మూడేళ్లలో ఇందిరమ్మ ఇళ్లు

-మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



2 లో

# ప్రజా ఉద్యమ దిక్సూచి సురవరం

(మొదటిపేజీ తరువాయి)

సుధాకర్‌రెడ్డి సంస్మరణ సభ మంగళవారం కొత్తగూడెం క్లబ్‌లో జరిగింది. సభకు ముందు సురవరం సుధాకర్‌రెడ్డి చిత్ర పటానికి వివిధ పార్టీల నేతలు, ప్రజా సంఘాల నాయకులు, స్వచ్ఛంద సంస్థల బాధ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సురవరం సుధాకర్ రెడ్డి మరణానికి సంతాప సూచికంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్‌పాషా అధ్యక్షతన జరిగిన సభలో కూనంనేని మాట్లాడుతూ సురవరం సుధాకర్‌రెడ్డి నిరంతర అధ్యయనశీలి అని తన వాదన పటిమతో ఎన్నో సమస్యలకు పరిష్కారం చూపారన్నారు. సిద్ధాంతం విషయంలో రాజీపడని కమ్యూనిస్టుగా తుది వరకు జీవించారని కమ్యూనిస్టుల అవసరం మరింత పెరుగుతున్న తరుణంలో సుధాకర్‌రెడ్డి మరణం అత్యంత బాధాకరమన్నారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో ఉన్న సామాజిక ఆర్థిక పరిస్థితులపై వ్యాసాల రూపంలోనో, ప్రకటనల రూపంలోనో లేదా సిపిఐ నాయకత్వంతో చర్చించో పార్టీ విధానాన్ని ప్రకటించే వారన్నారు. కమ్యూనిస్టులు మరణించి సైతం ప్రజల మదిలో జీవిస్తారని సుధాకర్‌రెడ్డి అదే కొవకు చెందిన వారన్నారు. పదవులు ఉన్నా లేకున్నా ప్రజల పక్షాన నిలిచే కమ్యూనిస్టులు ఐక్యం కావాల్సి ఉందన్నారు. సంఘటిత ప్రజా ఉద్యమాల నిర్మాణమే అమరులకు మనమిచ్చే నివాళి అని కూనంనేని తెలిపారు. భారత కమ్యూనిస్టు పార్టీ వందేళ్ల చరిత్రలో అనేక పోరాట విజయాలను చవి చూసిందని ఇప్పటికీ నిరంతరం పోరాడుతూ వందేళ్ల నవయవ్వనిలా ముందుకు సాగుతుందన్నారు. వైరా శాసన సభ్యులు మాలోత్ రాందాస్ నాయక్ మాట్లాడుతూ సుధాకర్‌రెడ్డి మరణంతో ఓ ప్రజా గొంతుక మూగబోయిందన్నారు. నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారం కోసం తపించిన సుధాకర్‌రెడ్డి భారత కమ్యూనిస్టు పార్టీలో చండ్ర రాజేశ్వరరావు తర్వాత అత్యున్నత స్థాయికి చేరిన తెలుగుబిడ్డ అని ఆయన తెలిపారు. కమ్యూనిస్టుల అవసరం సమాజానికి ఉందని ప్రజాప్రతినిధులుగా కమ్యూనిస్టు నాయకులతో కలిసి పనిచేయడం సంతోషాన్ని ఇస్తుందన్నారు. పినపాక శాసన సభ్యులు పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీలోనే తాను ఓనమాలు నేర్చుకున్నానని సుధాకర్‌రెడ్డి లాంటి నేతలు మరణించడం ప్రజా ఉద్యమాలకు తీరని లోటన్నారు. విద్యార్థి దశ నుంచే ఆయన తన పోరాట పటిమను చాటారని సిద్దాంత విపులీకరణలోనూ, ఆచరణలోనూ ఆయన ఆయనే సాటి అన్నారు. కమ్యూనిస్టులకు ప్రజలే ముఖ్యమని పదవులు కాదని తెలిపిన పాయం తాను ఇప్పటికీ ఎప్పటికీ కమ్యూనిస్టులను గౌరవిస్తూనే ఉంటానన్నారు. మాజీ శాసన సభ్యులు గుమ్మడి నర్సయ్య మాట్లాడుతూ కమ్యూనిస్టులుమరణించిన ప్రజల గుండెల్లో జీవించి ఉంటారని ఆయన తెలిపారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాగం హేమంతరావు, సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు ఆవునూరి మధు, సిపిఎం నాయకులు అన్నవరపు సత్యనారాయణ, మాజీ జెడ్పి ఛైర్మన్ కంచర్ల చంద్రశేఖర్, టిపిసిసి సభ్యులు నాగ సీతారాములు, ఆళ్ల మురళి, టిడిపి నాయకులు కె. అనంతరాములు, వివిధ ప్రజా సంఘాల నేతలతో పాటు సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, వెంకటేశ్వరరావు,కె. సారయ్య, సరెడ్డిపుల్లారెడ్డి, మున్నా లక్ష్మి కుమారి, నరాటి ప్రసాద్, సలిగంటి శ్రీనివాస్, చంద్ర నరేందర్, ఉదయ్ భాస్కర్, కొత్తగూడెం సొసైటీ ఛైర్మన్ మండే వీరహన్మంతరావు, గ్రంథాలయ ఛైర్మన్ పసుపులేటి వీరబాబు తదితరులు పాల్గొన్నారు. కంచర్ల జమలయ్య ఆహుతులను వేదికపైకి ఆహ్వానించారు.

## శాంతియుత నిరసనలపై
# పోలీసు కేసులా..?

(మొదటిపేజీ తరువాయి)

నిర్వహిస్తామని ఎక్కడ ఎవరికి ఇబ్బంది కలగనివ్వమని తెలిపి అదేవిధంగా ఆందోళన చేస్తే ఎందుకు పోలీసులు కేసులు నమోదు చేశారని ఆయన ప్రశ్నించారు. ఖమ్మం పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారని ప్రజాసమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువస్తున్న వారిపై కేసులు నమోదు చేయడం మానుకోవాలన్నారు. సోమవారం తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 32 జిల్లాల్లో కలెక్టరేట్ల వద్ద ఆందోళనలు జరిగాయని ఒక ఖమ్మంలోనే కేసులు నమోదు చేయడం శోచనీయమ న్నారు. ఖమ్మం పోలీసులు తీరు మార్చుకోకుంటే ప్రజల పక్షాన తగు రీతిలో స్పందించక తప్పదన్నారు. ప్రజాసమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చి పరిష్కారానికి కృషి చేయడం కమ్యూనిస్టులుగా మా బాధ్యత అని కేసులకు, నిర్బంధాలకు భయపడి రాజీపడబోమని సురేష్ స్పష్టం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారానికి తమ ఆందోళనలు కొనసాగుతూనే ఉంటాయని తెలిపారు.

## మౌలిక వసతుల కల్పనతో
# పెరగనున్న జీవన ప్రమాణాలు



**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :** గ్రామీణ మౌలిక వసతులతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క అన్నారు. ఎర్రుపాలెం మండలంలో జిల్లా కలెక్టర్ దురిశెట్టి అనుదీప్‌తో కలిసి మంగళవారం విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఎస్సీ సబ్ ప్లాన్ నిధుల కింద ఎస్సీ కాలనీలో రూ.45లక్షల వ్యయంతో నిర్మించనున్న రోడ్లకు శంకుస్థాపన చేశారు. అనంతరం పెద్దగోపవరం గ్రామంలో రూ.85లక్షలతో నిర్మించే రోడ్లకు, రూ.12లక్షలతో నిర్మించనున్న అంగన్వాడీ కేంద్రం నూతన భవనంకు శంకుస్థాపన చేశారు. అనంతరం బుచ్చిరెడ్డిపాలెంలో రూ.40లక్షలు, బనిగండ్లపాడులో రూ.175లక్షలతో నిర్మించనున్న రోడ్లకు శంకుస్థాపన చేశారు. అయ్యవారిగూడెం గ్రామంలో రూ.55లక్షలతో రోడ్లు, భీమవరం విద్యానగర్‌లో రూ.20లక్షలతో నిర్మించనున్న గ్రామపంచాయతీ భవనానికి శంకస్థాపన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా భట్టివిక్రమార్క మాట్లాడుతూ అభివృద్ధి పథంలో మధిర నియోజకవర్గ ముందుండేలా ప్రత్యేక అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రతి గ్రామానికి అభివృద్ధి వసతులు అందించే దిశగా ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. మౌలిక వసతులు అభివృద్ధి ద్వారా గ్రామీ ప్రజల జీవ ప్రమాణాలు మెరుగుపడతాయని, గ్రామాల అభివృద్ధి వేగంగా జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం ఆర్‌డిఓ నర్సింహారావు, విద్యుత్ ఎస్‌ఇ శ్రీనివాసాచారి, భద్రాద్రి జిల్లా డిఎఫ్ఓ సిద్ధార్థ విక్రమ్‌సింగ్, పిఆర్‌ఇ వెంకటరెడ్డి, తహశీల్దార్ మన్నె ఉషాశారద, ఎంపిడిఓ బి.సురేందర్, వివిధ శాఖల అధికారులు, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, కొండబాల కోటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, నాయుడు సత్యనారాయణ, మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నర్సింహారావు, మండల పార్టీ అధ్యక్షులు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, చావా రామకృష్ణ, శీలం శ్రీనివాస్‌రెడ్డి, అనుమోలు కృష్ణారావు, యరమల పూర్ణచంద్రారెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, క్లస్టర్ ఇన్‌చార్జిలు, యూత్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### నియోజకవర్గ అభివృద్ధి పనులపై డిప్యూటీ సిఎం సమీక్ష...

ఎర్రుపాలెం మండలంలో డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క మంగళవారం విస్తృతంగా పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. బనిగండ్లపాడులో భోజన విరామం అనంతరం జిల్లా కలెక్టర్ అనుదీప్‌తో కలిసి రెవెన్యూ, ఫారెస్టు, పంచాయతీరాజ్, విద్యాశాఖ, ఆరోగ్యశాఖ, పర్యాటకశాఖ అధికారులతో విడివిడిగా సమీక్షా సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, వాటిని త్వరిగతిన పూర్తి చేసేందుకు అధికారులు చేపట్టాల్సిన చర్యలు, రాబోయే రోజుల్లో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు.

## అర్హులందరికీ
# మూడేళ్లలో ఇందిరమ్మ ఇళ్లు



**ప్రజాపక్షం/కూసుమంచి:** రాష్ట్ర ఆర్థిక పరిస్థితి క్లిష్టమైనా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేస్తూనే ఉన్నామని, పేదలకు అండగా నిలవడం మా ప్రభుత్వ ధ్యేయమని, రాబోయే మూడు సంవత్సరాల్లో అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందజేస్తామని తెలంగాణ రెవిన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. మంగళవారం పాలేరు నియోజకవర్గ పర్యటనలో భాగంగా ఆయన పలు అభివృద్ధజ కార్యక్రమాల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కూసుమంచి మండలంలోని నాయకన్‌గూడెం గ్రామంలో రూ 20లక్షలతో నిర్మించిన పంచాయితీ కార్యాలయ భవనాన్ని ప్రారంభించారు. నర్సింహులగూడెం గ్రామంలో రూ 1.33కోట్లతో కిష్టాపురం, నర్సింహులగూడెం పీఆర్ రోడ్డుకు, కిష్టాపురం గ్రామంలో రూ 1.63కోట్లతో కిష్టాపురం, పోచారం పీఆర్ రోడ్డుకు రూ 2.40 కోట్లతో కిష్టాపురం ముత్యాలగూడెం పీఆర్ రోడ్డుకు శంకుస్థాపనలు చేశారు. జుజ్జులరావుపేటలో రూ 88లక్షలతో ఆర్‌అండ్‌బి రోడ్డును మల్లాయిగూడెం పీఆర్ రోడ్డుతో కలిపే బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కూసుమంచి జూనియర్ కళాశాల నూతన భవన నిర్మాణ పనులను పరిశీలించి వేగంగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు ఆదేశించారు. కూసుమంచి తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన శాండ్ బజార్‌ను ప్రారంభించారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులకు తక్కువ ధరకే ఒక టన్ను గోదావరి ఇసుకను రూ 1100కు, ఇతర అవసరాలకు టన్ను రూ 1300కు అందుబాటులో ఉంచామని తెలిపారు. అనంతరం కూసుమంచి ఎంఎల్‌ఏ క్యాంపు కార్యాలయంలో నిర్వహించి కార్యక్రమంలో నేలకొండపల్లి మండలానికి చెందిన 42, ఖమ్మం రూరల్ మండలానికి చెందిన 82 మొత్తం 124 మందికి కాటమయ్య రక్షక కిట్లు పంపిణీ చేశారు. కూసుమంచి మండలానికి చెందిన 18 మందికి కళ్యాణ లక్ష్మీ చెక్కులు అందజేశారు. పాలేరు నియోజకవర్గంలోని అన్ని మండలాలకు చెందిన 20 మంది క్రైస్తవ మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయా కార్యక్రమాలను ఉద్దేశించి మంత్రి పొంగులేటి మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వం ఎనిమిది లక్షల 15వేల కోట్ల రూపాయల అప్పు చేసి పేదలపై భారాలు మోపిందని, పేదలకు ఇళ్లు కడితే కమిషన్లు రావని వదిలేసిందన్నారు. కానీ వేల కోట్లు దండుకోవచ్చని కాళేశ్వరం ప్రాజెక్ట్‌ను అతి తక్కువ ఖర్చుతో కట్టారని, ప్రస్తుత ఇందిరమ్మ ప్రభుత్వం మాత్రం బిన్నంగా పేదల కోసం నిజాయితీగా పని చేస్తోందని, ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా నాలుగున్నర లక్షల ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చామని గుర్తు చేశారు. ఇల్లు అవసరమైన ప్రతి అర్హుడి కల నెరవేర్చే వరకు ప్రభుత్వం వెనుకడుగు వేయదని పొంగులేటి భరోసా ఇచ్చారు. ఈకార్యక్రమంలో పలువురు అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆదికర్మ యోగి అభియాన్ సభ్యులకు శిక్షణ



**ప్రజాపక్షం/పాల్వంచ :** గిరిజనుల సంస్కృతి, సాంప్రదాయాలు, వారి ప్రత్యేక అవసరాలను గుర్తించే విధంగా విజన్ బిల్డింగ్‌ను రూపొందించారని ఎంపిడిఓ కే. విజ భాస్కర్‌రెడ్డి అన్నారు. పాల్వంచ ఎంపిడిఓ కార్యాలయంలో ఆది కర్మయోగి అభియాన్ సబ్యులకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన నాయకులు, కమ్యూనిటి ప్రతినిధుల భాగస్వామ్యం ద్వారా గిరిజన గ్రామాల అభివృద్ధికి తోడ్పాటునందించాలన్నారు. మండలంలోని ఉల్వనూర్, చంద్రాలగూడెం, కారెగట్టు, పాయకారి యానంబైల్, సూరారం, తోగ్గూడెం, రంగాపురం తదితర ఏడు పంచాయితీలను కేంద్ర ప్రభుత్వం ఆదికర్మ యోగి అభియాన్ పథకానికి ఎంపిక చేసిందని చెప్పారు. ఆయా గ్రామాలలో స్కూలు, టీచర్, గ్రామపంచాయితీ కార్యదర్శి, క్షేత్ర సహాయకుడు, ఏఎన్‌ఎం, గ్రామ సమాఖ్య సబ్యులు, అంగన్‌వాడీ కార్యకర్త, పీసా మొబలైజర్‌లకు శిక్షణను ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ లక్ష్మి ప్రసన్న, ఏపిఓ పోరండ్ల రంగా, ఏపిఎం మీరాభి, శిక్షణ టీం మెంబర్ ప్రకాషరావు, ప్రధానోపాద్యాయులు మాధవీలత, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ప్రవీన్ కుమార్, హెచ్‌డబ్ల్యూ శ్రీను, సిసి సదళం, హెల్త్ సూపరవైజర్ తదితరులు పాల్గొన్నారు.

# సంపూర్ణ ఆరోగ్యానికి యోగా మంచి సాధనం



**ప్రజాపక్షం/భద్రాచలం :** సంపూర్ణ ఆరోగ్యానికి యోగ మంచి సాధన మని యోగా ఆరోగ్య మిషన్ నిర్వాహకులు నరేష్ అన్నారు. మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వయస్సుతో ఎలాంటి సంబంధం లేకుండా అంతా సంపూర్ణ ఆరోగ్యం పొందేందుకు యోగా మంచి మార్గమన్నారు. నెల రోజులుగా కమ్మ సత్రంలో నిర్వహించిన యోగా తరగతులు ముగింపు సందర్భంగా ఆయనను పలువురు సన్మానించారు. ఈ కార్యక్రమంలో అడుసుమల్లి జగదీష్, రాజా, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# పింఛన్లను విడుదల చేయండి

-మూడు నెలలుగా పెన్షన్ రాక అవస్థలు
-రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం ఆందోళన




ప్రజాపక్షం/ ఖమ్మం : మూడు నెలలుగా పెన్షన్ రాక వ్యవసాయ మార్కెటింగ్ శాఖలో పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వెంటనే పింఛన్ మొత్తాన్ని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం ఖమ్మంలో ఆందోళనను నిర్వహించింది. వ్యవసాయ మార్కెట్ కమిటీలో పని చేసి ఉద్యోగ విరమణ చేసిన వారికి జూన్ మాసం నుంచి నెలవారి పింఛన్ రావడం లేదు. ఈవిషయమై పలుసార్లు అధికారుల దృష్టికి సంబంధిత మంత్రి దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో వివిధ శాఖల ఉద్యోగులు స్థానిక అంబేద్కర్ సెంటర్‌లో నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం సంయుక్త అధ్యక్షులు జి. వీరస్వామి మాట్లాడుతూ పింఛన్ సొమ్ముపై ఆధారపడి జీవితాన్ని నెట్టుకొస్తున్న వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఒక జూన్ మాసంలోనే ఉద్యోగులకు సంబంధించి పెన్షన్, వేతనానికి సంబంధించి రూ.90,33,442 రావాల్సి ఉందని జులై మాసంలో పింఛన్లకు సంబంధించి రూ. 37,97,311, ఆగస్టు మాసానికి సంబంధించి పింఛన్ల సొమ్ము రూ.38,56,481రావాల్సి ఉందని ప్రభుత్వం తక్షణం పింఛన్ మొత్తాన్ని విడుదల చేసి కుటుంబాలను ఆర్థికంగా ఆదుకోవాలని ఆయన కోరారు. ఉద్యోగ విరమణ తర్వాత రావాల్సిన బకాయిలు రాక ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారని ప్రభుత్వం తగు రీతిలో స్పందించక పోతే ఆందోళన తప్పదని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షులు పరిశ పుల్లయ్య, ప్రధాన కార్యదర్శి రాయల రవికుమార్, కోశాధికారి గుర్రాల శ్రీనివాసరావు, పెన్షనర్ల సంఘం నాయకులు మేరీ ఏసుపాదం, పి. సత్యనారాయణ, కొల్లికొండ శరత్‌బాబు, వెంకటేశ్వర్లు, జిల్లా వెంకటేశ్వర్లు, బెల్లం రాధాకృష్ణమూర్తి, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

# ఆదర్శ కమ్యూనిస్టు సురవరం సుధాకర్‌రెడ్డి

ప్రజాపక్షం/ అశ్వారావుపేట : చిన్ననాటి నుండి వామపక్ష భావజాలంతో విద్యార్థి సంఘాలతో పనిచేస్తూ సువరం సుధాకర్‌రెడ్డి ఆదర్శ కమ్యూనిస్టుగా నిలిచారని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు సయ్యద్ సలీం అన్నారు. అశ్వారావుపేట మండల సమితి ఆధ్వర్యంలో సిద్దివెంకటేశ్వరనగర్‌లో సురవరం సుధాకర్‌రెడ్డి సంస్మరణ సభ జరిగింది. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సయ్యద్ సలీం మాట్లాడుతూ ప్రజా ఉద్యమాల్లో తనదైన ముఖ్య భూమిక పోషించి పేద బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికై పాటుపడ్డారని అన్నారు. రాష్ట్రం, దేశం మొత్తంలో కమ్యూనిస్టు పార్టీ నిర్మాణ పరంగా బలపడానికి ఆయన ఎంతో కృషి చేశారని అన్నారు. విద్యార్థి రంగంలో, కమ్యూనిస్టు పార్టీలో అంచలంచలుగా ప్రజలతో మమేకమై పనిచేస్తూ కమ్యూనిస్టు పార్టీలో జాతీయ ప్రధాన కార్యదర్శిగా వెలకట్టలేని సేవలు అందించారని అన్నారు. ఒక పర్యాయం ఎమ్మెల్యేగా, రెండు పర్యాయాలు పార్లమెంట్ సభ్యునిగా ఎన్నికై పేద ప్రజల గొంతును ప్రజా దర్బార్‌లో వినిపించిన ఘనత ఆయనకు దక్కుతుందన్నారు. కామ్రేడ్ సురవరం సుధాకర్‌రెడ్డి మరణం కమ్యూనిస్టుపార్టీకి



జాతీయస్థాయిలో తీరని లోటని, ఆయన ఆశయాలను ముందుకు తీసుకువెళ్లడమే ఆయనకు మనమిచ్చే నిజమైన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు గన్నిన రామకృష్ణ, అశ్వారావుపేట పట్టణ కార్యదర్శి నూకవరపు విజయ్‌కాంత్, పట్టణ సహాయ కార్యదర్శి జక్కం బలరాం, చీపుల సత్యవతి, చల్లా రమాదేవి, గద్ద సూర్యకుఆరి, కె.రసూల్‌బీ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# కాళోజీ సేవలు చిరస్మరణీయం

-కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : ప్రజా చైతన్యమే లక్ష్యంగా మహాకవి కాళోజీ నారాయణరావు రచనలు సాహితీవేత్తగా సమాజానికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. ప్రజాకవి స్వర్గీయ కాళోజీ నారాయణరావు 111వ జయంతి సందర్భంగా మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి కాళోజీ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ జీవిత చలనశీలి కాళోజీ అన్నారు. కాళోజీ నారాయణరావును యువత ఆదర్శంగా తీసుకుని ఉన్నతంగా ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌వో ఎ. పద్మశ్రీ, డిఎంఅండ్‌హెచ్‌వో కళావతిబాయి, జిల్లా ముఖ్య ప్రణాళికాధికారి ఎ. శ్రీనివాస్, ఎస్సీ కార్పోరేషన్ ఈడి నవీన్‌బాబు, కలెక్టరేట్ ఏవో కె. శ్రీనివాసరావు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**ఖమ్మం కార్పోరేషన్ కార్యాలయంలో...**

ఖమ్మం కార్పోరేషన్ కార్యాలయంలో కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మంగళవారం కాళోజీ జయంతి సందర్భంగా ఖమ్మం కార్పోరేషన్ కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో ఆయన చిత్ర పటానికి మేయర్ పునుకొల్లు నీరజ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ కాళోజీ ఆలోచనలు, కవిత్వం సమాజానికి దారి చూపాయన్నారు. ఆయన చూపిన మార్గంలో ముందుకు సాగాలన్నారు. అధికారులు, కార్పొరేటర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# క్రాంతి కళాశాలలో ఘనంగా కాళోజీ జయంతి వేడుకలు

ప్రజాపక్షం/వైరా: తాగూర్ విద్యాసంస్థలైన క్రాంతి జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో కాళోజి నారాయణరావు జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. కాళోజి నారాయణరావు చిత్రపటానికి విద్యాసంస్థల చైర్మన్ వాసిరెడ్డి సునీత, కరస్పాండెంట్ సంక్రాంతి రవికుమార్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సంక్రాంతి రవికుమార్ మాట్లాడుతూ తెలంగాణ భాషలోని వానిని వెలుగెత్తి చాటిన ప్రజాకవి, ప్రజల మనిషి, చైతన్యమూర్తి కాళోజి అని, పుట్టుక నీది చావు నీది బ్రతుకంతా దేశానిది అంటూ ఆయన జీవిత కాలమంతా ప్రజా ఉద్యమాలకు దారపోసిన మహా మనిషి అని, అన్యాయాన్ని ఎదిరించిన కాళోజి కలం నుండి జాలువారిన ఒక్కొక్క అక్షరం ఒక్కొక్క తూట..భావితరాలకు పోరాట స్ఫూర్తిని నింపిన నిరసనం కెరటం అని నినాదించిన మహోనీయుడు కాళోజి అని పేర్కొన్నారు. ఈ




సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి అత్యంత ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతి ప్రధానోత్సవం చేశారు. విద్యాసంస్థల డైరెక్టర్ సంక్రాంతి సంయోగిత, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ లింగారావు, మజీద్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఘనంగా కాళోజి జయంతి వేడుకలు



ప్రజాపక్షం/ మధిర : ప్రజా కవి కాళోజి నారాయణరావు జయంతి సందర్భంగా పలు ప్రభుత్వ కార్యాలయాల్లో, పార్టీ కార్యాలయాల్లో జయంతి వేడకలను ఘనంగా నిర్వహించారు. మధిర పట్టణంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మాజీ జెడ్పిచైర్మన్ లింగాల కమల్‌రాజు హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్వరాష్ట్ర ఉద్యమానికి తన రచనలతో స్ఫూర్తిని నింపి తెలంగాణ సాంస్కృతిక సౌరభాన్ని చాటిచెప్పిన మహాకవి కాళోజీ అని కొనియాడారు. అదేవిధంగా ప్రభుత్వాసుపత్రిలో కాళోజీ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి వైద్యాధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమాల్లో బిఆర్ఎస్ పార్టీ నాయకులు చిత్తారు నాగేశ్వరరావు, అరిగె శ్రీనివాసరావు, బొగ్గుల భాస్కర్‌రెడ్డి, బొగ్గుల వీరారెడ్డి, వైవి.అప్పారావు, వంకాయలపాటి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా తెలంగాణ భాషా దినోత్సవం



ప్రజాపక్షం/ మధిర : మడుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు తెలంగాణ తెలుగు భాషా దినోత్సవం కాళోజీ నారాయణరావు జయంతి పురస్కరించుకుని హెచ్ ఎం దీవిసాయకృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలుగు భాషా సేవకుడే గాక హైదరాబాద్ సంస్థానంలోని పీడిత ప్రజల స్వాతంత్ర్య కాంక్షను తట్టిలేపి బానిస బ్రతుకులకు వెట్టిచాకిరి వ్యతిరేకంగా ప్రజలను చైతన్యపరిచిన స్ఫూర్తిప్రదాత అని కొనియాడారు. తెలుగు ఉపాధ్యాయులు బివిబిఎన్ ఎంశర్మ తెలుగు పాఠ్యపుస్తకాల్లోగల పాఠ్యాంశాల్లోని మండలికాలు, ప్రాంతీయ భాషగా తెలుగు గొప్పదనాన్ని వివరించారు. అనంతరం నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థులను అలరించాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ వేమిరెడ్డి నాగలక్ష్మి ,ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# శ్రీదేవీ శరన్నవరాత్రోత్సవాల గోడ పత్రికల ఆవిష్కరణ



ప్రజాపక్షం/ ఎర్రుపాలెం : తెలంగాణ తిరుపతిగా పేరుగాంచిన జమలాపురం దివ్య క్షేత్రం నందు ఈ నెల 22 నుంచి నిర్వహించనున్న శ్రీ దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల గోడ పత్రికలను తెలంగాణ ఉపముఖ్యమంత్రి మల్లుభట్టివిక్రమార్క ఆవిష్కరించారు. ఎర్రుపాలెం మండలంలో పర్యటనలో భాగంగా మంగళవారం జమలాపురం శ్రీ వెంకటేశ్వరస్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. ముందుగా భట్టికి ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం వేదపడింతుల ఆధ్వర్యంలో జరిగిన పూజల్లో ఆయన పాల్గొన్నారు. అనంతరం శ్రీ దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల ప్రారంభానికి ముఖ్యఅతిథిగా భట్టిని సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాస్‌శర్మ, వేద పండితులు, ఆలయ కార్యనిర్వాహణాధికారి జగన్మోహన్‌రావు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రెండో విడతలో అర్హులను ఎంపిక చేయాలి



ప్రజాపక్షం/ తిరుమలాయపాలెం : తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఎన్నో వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం గూడులేని ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని వాగ్దానాలు చేసి ఇందిరమ్మ కమిటీల పేరుతో కాంగ్రెస్ కార్యకర్తలకు మొదటి విడతలో ఇచ్చిందని న్యూడెమోక్రసీ మండల కార్యదర్శి గొర్రెపాటి రమేష్ అన్నారు. రెండో విడతలోనైనా అర్హులైన నిరుపేదలను గుర్తించి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని ఎంపిడిఓ ఎస్కె సిలార్‌సాహెబ్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో న్యూడెమోక్రసీ నాయకులు గొర్రెపాటి వీరస్వామి, పోలే పొంగు నాగయ్య, మండల నాయకులు ఎస్కే షబ్బీర్, దారుమళ్ళ శంకర్, గొర్రెపాటి కృష్ణమోహన్, మల్సూరు తదితరులు పాల్గొన్నారు.

# వీల్‌చైర్ వితరణ




ప్రజాపక్షం/వైరా: గ్రేట్ విజన్ క్లబ్ అధ్యక్షులు లయన్ జాలా పుల్లారావు ఆధ్వర్యంలో లింగన్నపేటకు చెందిన దివ్యాంగుడు అంగడాల పుల్లయ్యు వీల్‌చైర్‌ను క్లబ్ అధ్యక్షులు పుల్లారావు పుట్టినరోజు సందర్భంగా అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఫాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ లయన్ డాక్టర్ కాపా మురళీకృష్ణ మాట్లాడుతూ దివ్యాంగులను ఆదుకోవడంలో వైరా గ్రేట్ విజన్ క్లబ్ ముందు ఉంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ మార్కెటింగ్ కోఆర్డినేటర్ లగడపాటి ప్రభాకర్‌రావు, విజన్ కోఆర్డినేటర్ పుంఢు శ్యామ్‌బాబు, జెడ్‌సి సిహెచ్.నాగేశ్వరరావు, డిసి పుంఢు వరలక్ష్మి, డిసి తోటకూర శ్రీకాంత్, సెక్రటరీ గంగవరపు కిషన్, ట్రెజరర్ పుయ్యూరు రామకృష్ణ, జాలా మహాలక్ష్మి, కె.గోపి, దగ్గుల రాజశేఖర్‌రెడ్డి, లయన్స్ సభ్యులు పాల్గొన్నారు.

## ఘనంగా తెలంగాణ భాషా దినోత్సవం



**ప్రజాపక్షం/ఏన్కూరు :** మండల పరిధిలోని గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల మూల పోచారం పాఠశాలలో తెలంగాణ భాషా దినోత్సవం మంగళవారం ఘనం గా నిర్వహించారు. గొప్ప కవి, స్వాతంత్ర సమర యోధుడు, ప్రజాకవి, పద్మ విభూషణ్ డాక్టర్ కాళోజీ నారాయణరావు జయంతి సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి. నాగరాజు మాట్లాడుతూ కాళోజీ జన్మదినం, తెలంగాణ భాషా దినోత్సవం గా జరుపుకోవటం నిజంగా తెలంగాణ రాష్ట్ర ప్రజలకు గొప్ప వరమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ వార్డెన్ బి.రవి, ఉపాధ్యాయులు కె.శ్యామల, బి.రవి, ఎం.చందర్ రావు, డి.వెంకటరమణ, వి.రమేష్, బి.సింగ్యా, జె.నాగేశ్వర రావు,డి.ఉషశ్రీ, టి.సౌందర్య తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కాళోజీ జయంతి వేడుకలు



**ప్రజాపక్షం/పాల్వంచ :** నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన కాళోజీ నారాయణ రావు తన రచనలతో ప్రజల్లో స్ఫూర్తిని నింపిన మహోనీయుడని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పోలారపు పద్మ అన్నారు. పాల్వంచ ప్రభుత్వ అటానమస్ డిగ్రీకళాశాలలో కాళోజీ నారాయణరావు జయంతి సంధర్భంగా మంగళవారం తెలుగు భాషా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సంధర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కాళోజీ నారాయణరావు 1914 సెప్టెంబర్ 9వ, తేదీన కర్ణాటక బీజాపూర్ రట్టిహల్లిలో జన్మించిన ఆయన బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా స్వాతంత్ర్య పోరాటం చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ జే. మాధవి, టి.అరుణ కుమారి, కొండలరావు, రమేష్, వేముల కామేశ్వరరావు, ఎన్. శ్రీదేవి, సూపరిండెంట్ విజయ్‌ప్రసాద్, ఈ.శ్రీనివాస్, పారెల్లి శ్రీనివాస్, కోటగిరి రాంబాబు, పొట్లపువ్వు శ్రీనివాసరావు, విమల, దీపిక, లీల, సౌమ్య, బాబ్జి ఖాన్, నరేష్, శివ, బి. రమేష్, హారిక, కరీమా, పవన్, ఫర్వీన్ , విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## మండల స్థాయి ఉపాధ్యాయుల టిఎల్ఎం మేళా విజయవంతం



**ప్రజాపక్షం/కరకగూడెం:** కరకగూడెం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం మండల స్థాయి టిఎల్ఎం మేళాను మండల విద్యాశాఖ అధికారి జి. మంజుల ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని ఉపాధ్యాయులు పాల్గొని, తమ సృజనాత్మకతతో బోధన అభ్యాసన సామగ్రిని (టిఎల్ఎం) ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఎంపికైన ఉపాధ్యాయులు రాబోయే జిల్లా స్థాయి టిఎల్ఎం మేళాలో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించాలని కోరారు. విద్యా నాణ్యతను మెరుగు పరిచే దిశగా ఉపాధ్యాయుల కృషి ప్రశంసనీయం అని మండల విద్యాశాఖ అధికారి పేర్కొన్నారు.ఈ మేళా ద్వారా విద్యార్థుల్లో నేర్చుకునే ఆసక్తి పెంపొందించడంతో పాటు, ఉపాధ్యాయుల్లో కొత్త ఆవిష్కరణలకు దారితీసే వేదికగా నిలిచింది. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

## కాళోజీ స్ఫూర్తితో తెలంగాణ భాష, యాస గౌరవాన్ని పెంచాలి



**ప్రజాపక్షం/మణుగూరు:** కాళోజీ స్ఫూర్తితో తెలంగాణ భాష, యాస గౌరవాన్ని పెంచాలని ఇంచార్జ్ ఏరియా ఇంచార్జ్ జనరల్ మేనేజర్ వీరభద్ర రావు అన్నారు. ప్రజా కవి కాళోజీ నారాయణ రావు జన్మ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిఎం కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం సింగరేణి కాలరీస్ ఆధ్వర్యంలో తెలంగాణ భాష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం ఇతర అధికారులు, గుర్తింపు సంఘం నాయకులు మేకల ఈశ్వర్, ప్రాతినిధ్య సంఘం నాయకులు వి. కృష్ణం రాజు కూడా కాళోజీ చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ టూ జిఎం బి. శ్రీనివాస చారి, ఏజిఎం (ఐఈడి) సిహెచ్. రాంబాబు, డిజిఎం(పర్సనల్) ఎస్ రమేశ్, డిజిఎం(ఫైనాన్స్) ఎం. అనురాధా, డిజిఎం (సివిల్) శివ ప్రసాద్, పర్యావరణ అధికారి శ్రీనివాస్ రావు, ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ కే. శ్రీనివాస్, సీనియర్ పర్సనల్ అధికారి సింగు శ్రీనివాస్, జిఎం ఆఫీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సబ్ స్టేషన్ ప్రారంభమెన్నడో..!?

**-వర్షపు నీరు, పిచ్చి మొక్కలతో దర్శనం..**
**-సబ్ స్టేషన్ పనులు ప్రారంభించాలని రైతన్నలు వేడుకోలు**



**ప్రజాపక్షం/పినపాక:** విద్యుత్ లోవోల్టేజీ సమస్యను తీర్చేందుకు, కరెంట్ సరఫరాలో పదే పదే విద్యుత్ అంతరాయాన్ని తొలగించేందుకు ఉన్న, సబ్‌స్టేషన్లపై అదనపు భారం తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నూతన సబ్ స్టేషన్లను మంజూరు చేసింది. ఇందులో భాగంగా పినపాక మండలంలోని వెంకట్రావు పేట గ్రామంలో 33/11కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మించేందుకు నిధులు మంజూరయ్యాయి. ప్రభుత్వ భూమిని సబ్‌స్టేషన్ నిర్మాణం కోసం కేటాయించారు. అయినప్పటికి విద్యుత్ సబ్ స్టేషన్ పనులు మాత్రం కొన్ని ఏండ్లు గడుస్తున్న ప్రారంభానికి నోచుకోని పరిస్థితి నెలకొంది. సబ్‌స్టేషన్ స్థలం పిచ్చిచెట్లతో నిండి పోయి, వర్షపు నీరు నిలిచి వెక్కిరిస్తోంది. పనులు ప్రారంభమవుతాయా లేదా అని రైతన్నలు అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు. సబ్‌స్టేషన్ నిర్మాణానికై రైతులు ఎన్నోమార్లు అధికారులకు, నాయకులకు మొరపెట్టుకున్నారు. సబ్‌స్టేషన్ నిర్మాణం పనులను ప్రారంభించి విద్యుత్ లోవోల్టేజ్ సమస్యలను తీర్చాలని ప్రజలు కోరుతున్నారు. వివరాల్లోకి వెళ్తే పినపాక మండలంలో వెంకట్రావ్ పేట పంచాయతీలోని చుట్టూ పక్కల పలు గ్రామాల్లో వ్యవసాయ నిమిత్తం లోఓల్టేజ్ నివారణకు గాను పట్ట భూములు కలిగి ఉన్న ప్రభుత్వ భూమిలో కొన్ని లక్షలతో సబ్ స్టేషన్ నిర్మాణం, భూమి పూజ నిర్మాణం చేపట్టి పూర్తి చేశారు. అన్ని హంగులతో ఏర్పాటైన, సబ్ స్టేషన్ ప్రారంభించడానికి నోచుకోలేదని ఆయా గ్రామాల రైతులు వాపోతున్నారు. ఏండ్లు గడుస్తున్నా అధికారుల నిర్లక్ష్యం కారణంగా పాలకుల చొరవ లేక పోవడంతో సబ్ స్టేషన్ ప్రారంభానికి నోచుకోలేదు. ప్రారంభమైనా సబ్ స్టేషన్ వోల్టేజ్ నుండి బయట పడవచ్చని రైతన్నలు ఆశగా ఎదురు చూసినా.. అది నిరాశ గానే మిగిలింది.

**సబ్ స్టేషన్ పనులు ప్రారంభించాలి : పురుషోత్తం, సిపిఐ నాయకులు వెంకట్రావుపేట గ్రామం.**



విద్యుత్ లోవోల్టేజీని, సరఫరాలో అంతరాయాన్ని నిరోధించేందుకు విద్యుత్ సబ్ స్టేషన్ పనులను వెంటనే ప్రారంభించాలి. రైతుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని సబ్ స్టేషన్ పనులను అధికారులు మొదలు పెట్టాలి. ఐదారు గ్రామాల ప్రజలకు ప్రయోజనంగా ఉంటుంది.

# సంక్షేమ పథకాలు అందని గడప లేదు

**-గురుపూజోత్సవం రోజు గురువులను సన్మానించాం**
**-ఎంఎల్ఏ పాయం వెంకటేశ్వర్లు**





**ప్రజాపక్షం/బూర్గంపాడు:** తెలంగాణ ప్రజా ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు అందని గడప లేదని, రాబోయే స్థానిక ఎన్నికల్లో వందకి వందశాతం విజయం సాధించేందుకు దోహదపడతాయని పినపాక ఎంఎల్ఏ పాయం వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ఐటిసి తరపున సారపాక నాగినేనిప్రోలురెడ్డిపాలెం, బూర్గంపాడు ప్రభుత్వ పాఠశాలలో ఆరవ తరగతి నుండి ఎనిమిదవ తరగతి వరకు చదువుతున్న గిరిజన బాలికలకు ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొని సైకిళ్ళు పంపిణీ చేశారు. అనంతరం మండల కేంద్రంలో నిర్మించిన వాటర్ ట్యాంక్‌కు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో ఎస్టీ విద్యార్థులే కాకుండా అన్ని వర్గాల బాలికలకు కూడా సైకిళ్ల పంపిణీ చేసేందుకు చొరవ చూపాలని ఐటిసి అధికారులకు సూచించారు. ఇటీవల సెప్టెంబర్ 5న సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం గురువులకు కొంత నిధులు కేటాయిస్తూ వారిని సన్మానించడం జరిగిందని గుర్తు చేశారు. బాలికలకు చదువుతో పాటు క్రమశిక్షణ ఆటపాటలలో శిక్షణ అందించడంలో గురువుల పాత్ర కీలకమని అన్నారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో జములారెడ్డి, ఎంఈవో యెదు సింహారాజు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సాయి కిరణ్, ఎంపీవో బాలయ్య, ఐటిసి అధికారి చెంగల్‌రావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దుగ్గెంపూడి కృష్ణారెడ్డి, మాజీ జెడ్‌పిటిసి బట్టా విజయ్‌గాంధీ, జిల్లా లీగల్ సెల్ కన్వీనర్ భజన సతీష్‌కుమార్, లక్ష్మీ పురం మాజీ ఉపసర్పంచ్ పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, కాంగ్రెస్ బూర్గంపాడు టౌన్ అధ్యక్షులు మందా నాగరాజు, నాయకులు మహమ్మద్ ఖాన్, ఎడమకంటి పిచ్చిరెడ్డి, పూలపెల్లి సుధాకర్‌రెడ్డి, బాదం రమేష్‌రెడ్డి, ఇంగువ రమేష్, సారెడ్డి అశోక్‌రెడ్డి, భజన ప్రసాద్ కుమార్, నిమ్మల హరీష్, దునుకు రాము, గుండె సాయి, కాటం వెంకట్రామిరెడ్డి, భాస్కరరావు, పాలెం లక్ష్మీ రెడ్డి, రోశిరెడ్డి, దాసరి సాంబ, చిప్పరాజు, నవీన్, రాంబాబు, చంటి, తదితరులు పాల్గొన్నారు.

## అమాయక గిరిజనులపై ఫారెస్ట్ అధికారుల దాడులు ఆపాలి

**12న ఛలో ఐటిడిఏ కార్యక్రమాన్ని జయప్రదం చేయండి**




**ప్రజాపక్షం/బూర్గంపాడు:** అమాయక గిరిజనులపై ఫారెస్ట్ అధికారులు దాడులు ఆపాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మువ్వ వెంకటేశ్వరరావు(లడ్డా)అన్నారు. మంగళవారం సారపాక సిపిఐ ఆఫీస్‌లో సిపిఐ అత్యవసర సమావేశం పేరాల శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగింది. ఈసమావేశానికి ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొని మాట్లాడుతూ ఈనెల 12వ తేదీన ఛలో ఐటిడిఏ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని, గిరిజన గ్రామాలకు మౌలిక వసతులు కల్పించాలని, పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా పోడు భూములు సర్వే చేసి ఇంత వరకు వారికి ఎటువంటి ఆధారాలు ఇవ్వలేదని, రోడ్లు, మంచినీళ్లు, విద్యుత్ లేక చీకటిలోనే జీవనం సాగిస్తున్నారని తెలిపారు. కనీసం చదువుతున్న పిల్లలకు కూడా కులం, ఆదాయం సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని, అందుకు నిరసనగా 12వ తేదీన తలపెట్టి ఛలో ఐటిడిఏ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో మండల సహాయ కార్యదర్శి బాలకృష్ణ, శ్రీరాంపురం కాలనీ పెద్ద మనిషి సోడే చంద్రయ్య, చింతల గుంపు పెద్ద మనిషి పోడియం సల్మాన్, తదితరులు పాల్గొన్నారు.

## తహసీల్దార్ కార్యాలయంలో కాలోజీ జయంతి



**ప్రజాపక్షం/అశ్వాపురం:** తహసీల్దార్ కార్యాలయంలో ప్రజాకవి కళోజి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా తహసీల్దార్ మనీధర్ కాలోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో అశ్వాపురం ఆర్ఐ 1 లీలావతి, యూడిసి కనకలక్ష్మీ, జూనియర్ అసిస్టెంట్ నరసింహారావు, తహసీల్దార్ సిబ్బంది రాజేష్, సతీష్, కన్నమ్మ, ప్రియాంక, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పథకాలు అర్హులైన గిరిజనులకు అందేలా చూడాలి

**-ఐటిడిఏ సహాయ ప్రాజెక్ట్ అధికారి జనరల్ డేవిడ్ రాజ్**



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** తెలంగాణ, కేంద్ర ప్రభుత్వం ద్వారా విడుదలయ్యే సంక్షేమ పథకాలు నేరుగా అర్హులైన ప్రతి గిరిజన కుటుంబాలకు అందించడానికి మండల్ లెవెల్ కమిటీ సభ్యులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ఇంటింటికి తిరిగి అర్హులైన ప్రతి ఒక్కరిని గుర్తించి వారి పేర్లు నమోదు చేయాలని ఐటిడిఏ సహాయ ప్రాజెక్ట్ అధికారి జనరల్ డేవిడ్ రాజ్ అన్నారు. మంగళవారం బూర్గంపాడు మండలంలోని ఎంపీడీవో కార్యాలయం సమావేశం మందిరంలో ఆది కర్మయోగి అభియాన్ పథకం ప్రతి స్పందనాత్మక పాలనా కార్యక్రమంలో భాగంగా గ్రామ స్థాయి అధికారుల శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆది కర్మయోగి అభియాన్ పథకం సంబంధించిన కార్యక్రమాలు మండలంలోని నకిరిపేట, ఉప్పుసాక, కృష్ణసాగర్ గ్రామాలలోని గిరిజనులకు మండల్ లెవెల్ కమిటీ సభ్యులు ముందుగా గిరిజన గ్రామాలను సందర్శించినప్పుడు గ్రామములో గ్రామ సభ ఏర్పాటు చేసి పథకాలకు సంబంధించిన అన్ని అంశాలను ప్రత్యేకంగా ఒక బోర్డుపై వ్రాయించి, ప్రజలకు ముందుగా వారికి అర్ధమయ్యే రీతిలో బోధన, ప్రజలు ఆలోచించేలా ప్రోత్సహించాలన్నారు. గిరిజన గ్రామాలలో ప్రకటించిన షెడ్యూల్ ప్రకారము తప్పని సరిగా మండల్ లెవెల్ కమిటీ సభ్యులు కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ప్రభుత్వాలు అందిస్తున్న పథకాల గురించి అవగాహన కల్పించి వారు తీసుకునేలా చూడాలన్నారు. ఆయా గ్రామాలలో ఒక్కొక్క శాఖకు ఎన్జీవో సాథిలను నియమించుకొని వారి ద్వారా గిరిజన ప్రజలకు అర్ధమయ్యేలా వారి భాషలోనే తెలియజేయాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన పథకాల గురించి గ్రామస్తులు చర్చించుకొని పథకాలు లబ్ధిపొందేలా చూడాలన్నారు. అర్హులైన గిరిజనులకు పథకాలతో పాటు, గ్రామంలోని సమస్యలు తెలుసుకొని ఆయా గ్రామాలలో మౌళిక వసతుల కల్పనకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. గిరిజన సంక్షేమ శాఖ ద్వారా విడుదలయ్యే పథకాలతో పాటు గిరిజన గ్రామాలలో అనేక రకాల వనరులు అందుబాటులో ఉన్నాయని, ఆ వనరులను సద్వినియోగం చేసుకోవడంతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెడుతున్న పథకాలు వారి దరికి చేరేలా చూడాలని, గ్రామాలలో ఉత్సాహవంతులైన యూత్, పెద్దలకు క్లుప్తంగా తెలియజేస్తే గ్రామంలోని ప్రతి ఒక్కరూ ఈ పథకాల గురించి చర్చించుకొని లబ్ది పొందుతారని, మంచి ఉద్దేశంతో చేపట్టిన ఈకార్యక్రమం మండల్ లెవెల్ కమిటీలు బాధ్యతతో ముందుకు తీసుకొని పోయేలా చూడాలన్నారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో, ఆది కర్మయోగి అభియాన్ పథకం మండల నోడల్ అధికారి జములారెడ్డి, హెచ్‌డబ్ల్యూవో నాగరాజు, హెచ్‌ఈవో బి రవి, హెచ్‌ఎం ఉషారాణి, సిసి రాంబాబు, ఐసిడిస్ సూపర్వైజర్ జగదాంబ, తదితరులు పాల్గొన్నారు.

# అంతా నా ఇష్టం..!

**-సమయ పాలన పాటించని ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్**
**-నివాసం ఖమ్మంలో.. విధులు బూర్గంపాడులో...**
**-ఆయన తీరుపై సర్వత్రా విమర్శల వెల్లువ**



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** రాష్ట్ర ప్రభుత్వం అధికారులకు తప్పని సరిగా సమయ పాలన పాటించాలని పదే పదే తెలుపుతున్నా...బూర్గంపాడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో మాత్రం అందుకు భిన్నంగా ఉందని పలువురు పేర్కొంటున్నారు. రిజిస్ట్రార్ కార్యాలయంలో పని చేసే ఉద్యోగులు సమయపాలన పాటించేలా నడిపించాల్సిన సబ్ రిజిస్ట్రారే సమయ పాలనకు మంగళం పాడుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. బూర్గంపాడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో నేనే రాజు నేనే మంత్రి అన్న చందంగా ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్ వచ్చిన సమయమే ప్రభుత్వ నిర్ణయించిన సమయంగా, ఆయన వెళ్లే సమయయే ప్రభుత్వం చెప్పిన సమయంగా ఉందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఆ సారు ఖమ్మం నుండి బూర్గంపాడు వస్తుంటారని, మళ్లీ తిరిగి బూర్గంపాడు నుండి ఖమ్మం వెళ్లాడం జరుగుతుందని ప్రజలు గుసగుసలాడుతున్నారు. సార్ మాత్రం స్థానికంగా ఉండటం లేదని ఇలా అయితే ఎలా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. వారంలో సారు రెండు, మూడు రోజులైతే వస్తారని, వేతనం మాత్రం పుల్‌గా తీసుకుంటారని, సెలవులు అనే మాటకు ఆస్కారమే లేదనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. బూర్గంపాడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సమయ పాలనకు మంగళం పాడుతున్న జిల్లా రిజిస్ట్రార్ పరిశీలించి, చర్యలు తీసుకోకపోవడంపై ప్రజలు మండిపడుతున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి పూర్తి స్థాయిలో సబ్ రిజిస్ట్రార్‌ను నియమించాలని ప్రజలు కోరుతున్నారు.

# గుంతలమయంగా మారిన రహదారులు..!

**ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు**





**ప్రజాపక్షం/ఏన్కూరు :** మండల వ్యాప్తంగా కురిసిన భారీ వర్షాలకు రహదారులు గుంతల మాయంగా మారాయి. దీంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఏన్కూర్ నుండి తూతకలింగన్నపేట మీదుగా తిమ్మారావుపేట, ముచ్చర్ల, ఖమ్మం, ఇల్లందు నిత్యం వందలాది భారీ వాహనాలు, మోటార్ సైకిల్లు తిరుగుతుంటాయి. రోడంత గుంతల మయంగా మారడంతో వాహనదారులు సైతం పలు ప్రమాదాలకు అవుతున్న ఆర్ అండ్ బి అధికారులు మాత్రం పట్టించుకోవడంలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తూతకలింగన్నపేట చెప్టా కొట్టుకుపోయి వాహనదారులు భయభ్రాంతులకు గురవుతున్నారు. చెరువు అలుగు పడినప్పుడల్లా రోడ్డుపై నీరు పారుతుంది. అటుగా వెళ్లే వాహనదారులు వెళ్లే పరిస్థితి లేకుండా పోతుంది. చెప్టాకు రెండు కోట్లు నిధులు వచ్చినప్పటికీ కాంట్రాక్టర్ టెండర్ వేసిన ఇంతవరకు పనులు ప్రారంభించలేదు. అయినప్పటికీ ఆర్ అండ్ బి అధికారులు చర్యలు చేపట్ట పోవడంతో ప్రజలు అసంతృప్తి చెందుతున్నారు. చెప్టా పై ఆర్ అండ్ బి అధికారులు కనీసం సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.



ఏనుకూరు నుండి జన్నారం మీదుగా పల్లిపాడు, ఖమ్మం, హైదరాబాద్ నిత్యం వేలాది వాహనాలు తిరుగుతుంటాయి. రోడ్డు మధ్య భాగంలో పెద్దపెద్ద గుంతలు ఏర్పడి ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటీవల కాలంలో గుంతలను తప్పించబోయి ఎదురెదురుగా రెండు కార్లు ఢీకొనడంతో వాహనంలో మంటలు చలరేగడంతో కారులో ఉన్న నలుగురు వ్యక్తులు త్రుటిలో ప్రాణాలను కాపాడుకున్నారు. కార్ పూర్తిగా దగ్ధమైంది. జన్నారం, అంజనాపురం మధ్య గల వాగు భారీ వర్షాలకు బ్రిడ్జిపై నుండి నీరు పాడటంతో వాహన నిలిచిపోతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే మరమ్మతులు చేపట్టి ప్రమాదాల నివారణలకు చర్యలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

## కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన



**ప్రజాపక్షం/చంద్రుగొండ:** కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని ఎంపీడీవో అశోక్ తెలిపారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో కేంద్ర ప్రభుత్వ పథకమైన ఆది కర్మ యోగి అభయాన్ పథకంపై గ్రామ పంచాయితీ స్థాయి పలు శాఖల అధికారుల శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. మండలంలోని గిరిజన గ్రామాలైన శృంగారం, పోకలగూడెం, గొర్రెగూడెం గ్రామ పంచాయితీలను ఈ పథకం కింద ఎంపిక చేయడం జరిగిందన్నారు. ఇకపై ఈ గ్రామాలలో సంక్షేమ పథకాలు పూర్తి స్థాయిలో అమలు చేయడంతో పాటు మౌళిక సదుపాయాలను కల్పిస్తామన్నారు. గ్రామాలలో ప్రజలకు ఉపయోగపడే విధంగా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ఈకార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ సుజాత, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఉత్తమ ఉపాధ్యాయులకు ఘనసన్మానం



**ప్రజాపక్షం/చంద్రుగొండ:** రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు చంద్రుగొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు చంద్రుగొండ మండల విద్యాశాఖ అధికారి ఎం సత్యనారాయణ ఆధ్వర్యంలో మండల ఉత్తమ ఉపాధ్యాయులను మంగళవారం ఘనంగా సన్మానించారు. మండల పరిధిలోని అన్ని యజమాన్య పాఠశాలలో వివిధ కేటగిరిలో పని చేస్తున్న ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులకు మొత్తం 31 మందికి మండల ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును మండల విద్యాశాఖ అధికారి ఎం సత్యనారాయణ చేతు మీదుగా అవార్డు అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ తమ పాఠశాలల పిల్లలకు మంచి విద్యాబోధన అందించాలని, ఉన్నత శిఖరాలకు ఎదిగే విధంగా విద్యార్థులను తయారు చేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎంలు ఉప్పల్‌రెడ్డి, సూరయ్య, భవాని, మండలంలో ఉన్న ఉపాధ్యాయుల సంఘాలు పిఆర్‌టియు, యూటిఎఫ్ టీటీఎఫ్, టీడబ్ల్యూటీయూ సంఘ నాయకులు ఇస్లావత్ వీరన్న, లక్ష్మ ణ్, ఏ శ్రీను, ఈ రమేష్, ఎం వెంకటేశ్వర్లు, సీఆర్‌పీలు బి సేవ్యా, ఏ రమేష్, పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే రాందాస్ నాయక్ సమక్షంలో పలు కుటుంబాలు కాంగ్రెస్‌లో చేరిక

**ప్రజాపక్షం/జూలూరుపాడు:** జూలూరుపాడు మండల పరిధిలోని లైన్ తండా, చింతల్ తండాలకు చెందిన 50 కుటుంబాలు మంగళవారం బిఆర్‌ఎస్‌కు రాజీనామా చేసి ఎంఎల్‌ఏ రాందాస్ నాయక్ ఆధ్వర్యంలో మండల కాంగ్రెస్ కార్యాలయంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఎంఎల్‌ఏ వారిని కాంగ్రెస్ పార్టీలోకి సాదరంగా ఆహ్వానించి, గ్రామ పంచాయితీకి కావాల్సిన అవసరాలు తీర్చడంలో తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. జూలూరుపాడు మండలంలో బిఆర్‌ఎస్ పార్టీ వీరాభిమాని భూక్య రాములు మాజీ సర్పంచ్ చింతల్ తండాలో గట్టి పట్టుకున్న నాయకుడు, కాంగ్రెస్ పార్టీలో చేరడం అందరికీ ఆశ్చర్యం కలిగించింది. మదన్‌లాల్ కుడి భుజంగా ఉండే రాములు ఎందుకు బిఆర్‌ఎస్‌ను వీడుతున్నారో అర్థం కానీ ప్రశ్న, అయితే బిఆర్‌ఎస్ నాయకులు సరైన భరోసా లేకపోవడం తోనే కాంగ్రెస్ పార్టీ వైపు చూసినట్లు పలువురు ప్రజలు చర్చించుకుంటున్నారు.

## ఉత్తమ అధికారులకు ఘనసన్మానం



**ప్రజాపక్షం/కారేపల్లి:** మండల విద్యావనరుల కేంద్రంలో మండల ఉత్తమ విద్యాశాఖ అధికారిగా అవార్డు అందుకున్న మండల విద్యాశాఖ అధికారి దుగ్గిరాల జయరాజును, అదే విధంగా ఉత్తమ ఉపాధ్యాయుడుగా అవార్డు అందుకున్న బి శ్యామ్‌లాల్‌ను మండల విద్యా వనరుల కేంద్రం సిబ్బంది మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు లక్ష్మ ణ్, మంగీలాల్, మోతిలాల్, సీఆర్పీలు రాములు, కిషోర్, పరమేష్, సురేష్, రాణి, ప్రమీల, ఐఆర్పి వెంకటలక్ష్మీ, రుత్తమ్మ, కమల, వినోద్, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు విద్యతో పాటు బుద్ధులు నేర్పించాలి : ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/జూలూరుపాడు:** విద్యార్థులకు విద్యతో పాటు బుద్ధులు నేర్పించాలని ఎంఎల్‌ఏ రాందాస్ నాయక్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో మండల విద్యాశాఖ అధికారి జుంకీలాల్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొని, ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్, కాళోజీ రావు చిత్రపటాలకు పూలమాలలు వేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఉపాధ్యాయులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం గతంలో ఉన్న విద్యకు ఇప్పుడున్న విద్యకు చాలా వ్యత్యాసాలు ఉన్నాయని, గతంలో భయం భక్తులతో విద్య నేర్చుకున్నామని తెలిపారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయులను ఆయన శాలువాతో ఘనంగా సన్మానించి, మెమొంటోలను అందించారు. అనంతరం టిఎల్ఎం ఎగ్జిబిషన్ మేళాను పరిశీలించారు. మండల వ్యాప్తంగా టీచింగ్ లెర్నింగ్ మెథడ్స్‌లో ఎన్నోవేటివ్‌గా కొంత మంది ఉపాధ్యాయులు ప్రదర్శనలు ప్రదర్శించారు.

# కొత్త పెన్షన్ విధానాన్ని రద్దు చేయండి

**-పెన్షనర్ల బకాయిలను తక్షణం విడుదల చేయాలి**
**-రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం నేత వీరస్వామి**









**ప్రజాపక్షం/ ఖమ్మం :** కొత్త పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని వెంటనే పునరుద్ధరించాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం రాష్ట్ర సంయుక్త అధ్యక్షులు జి. వీరస్వామి డిమాండ్ చేశారు. పెన్షనర్ల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్య, నాన్చివేత ధోరణిని అవలంభిస్తుందని ఆయన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం ఖమ్మంజిల్లా జనరల్ బాడీ సమావేశం మంగళవారం దుగ్గినేని సత్యనారాయణరావు హాల్ (జెడ్పి మీటింగ్ )లో జరిగింది. జిల్లా అధ్యక్షులు పరిశ పుల్లయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో వీరస్వామి మాట్లాడుతూ ఉద్యోగ విరమణ అనంతరం ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలు 15 మాసాలు గడిచిన రావడం లేదని ఉద్యోగ విరమణ తర్వాత వచ్చే మొత్తంతో కొందరి జీవితం ఆధారపడి ఉందని ఆ విషయాన్ని ప్రభుత్వం మరిచిపోతుందని వీరస్వామి తెలిపారు. పింఛన్‌దారులకు సంబంధించిన బకాయిలను తక్షణం విడుదల చేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. గ్రంథాలయాలు మార్కెట్ కమిటీలలో సేవలు అందించి ఉద్యోగ విరమణ చేసిన పెన్షనర్లకు ఇతర పెన్షనర్ల మాదిరిగా ట్రెజరీల ద్వారా చెల్లింపులు జరిగేవిధంగా చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. గతంలో విద్యాశాఖలో రూ. 398 నిర్ణీత వేతనంతో పనిచేసి రిటైర్ అయిన వారికి నోషనల్ ఇంక్రిమెంట్స్ ఇస్తామని హామీ ఇచ్చారని ఇచ్చిన హామీని నెరవేర్చాలని ప్రభుత్వాన్ని కోరారు. పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి పెన్షనర్స్ డైరెక్టరేట్‌ను ఏర్పాటు చేసి డైరక్టర్ స్థాయి అధికారిని నియమించడంతో పాటు హైదరాబాద్ నగరంలో పెన్షనర్ల భవనాన్ని నిర్మించాలని ఆయన డిమాండ్ చేశారు. మొదటి పే కమిషన్ ప్రతిపాదించినట్లు 20 ఏళ్ల సర్వీసుకు పూర్తి పెన్షన్‌ను అందించడంతో పాటు పిఆర్‌సి, ఐఆర్ పెంపుదల చేయాలని తెలంగాణ ఉద్యమంలో పాల్గొని ఉద్యోగ విరమణ చేసిన వారికి ప్రత్యేక ఇన్సెంటీవ్ ఇచ్చి గుర్తింపునివ్వాలన్నారు. ముఖ్యంగా పెన్షనర్లకు సంబంధించి నగదు రహిత వైద్యం అందించడంతో పాటు వెల్‌నెస్ సెంటర్లను ఏర్పాటు చేయాలని వీరస్వామి డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వి. రాంమనోహర్, వరంగల్ జిల్లానాయకులు తుమ్మా వీరయ్య, కె. సుధీర్‌బాబు, ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి రాయల రవికుమార్, ఆర్థిక కార్యదర్శి కనపర్తి వెంకటేశ్వర్లు, సంఘ బాధ్యులు మేరీ ఏసుపాదం, అంజలి, పెదమళ్ల సత్యనారాయణ, కొలికొండ శరత్‌బాబు, ఊడుగు వెంకటేశ్వర్లు, వీరభద్రరావు, లక్ష్మి సుజాత, అన్నమ్మ, ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

# పరిశుభ్రతకు ప్రాధాన్యతనివ్వాలి

**-ఖమ్మం మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం కార్పోరేషన్ పరిధిలో పరిశుభ్రతకు ప్రాధాన్యతనివ్వాలని ఖమ్మం మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య తెలిపారు. మంగళవారం ఖమ్మం కార్పోరేషన్ కార్యాలయంలో శానిటరీ సూపర్‌వైజర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లతో పారిశుధ్య నిర్వహణపై కమిషనర్ అభిషేక్ అగస్త్య సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఖమ్మం నగర పరిశుభ్రతకు ప్రాధాన్యతనివ్వాలన్నారు. సిబ్బంది తమ విధులను ప్రతిరోజు క్రమం తప్పకుండా నిర్వర్తించేలా చర్యలు తీసుకోవాలన్నారు. నగరంలో ఎక్కడ చెత్త లేకుండా ప్రతిరోజు ఆటోలు, ట్రాక్టర్ల ద్వారా సేకరణ జరుగుతుందో లేదో అధికారులు పర్యవేక్షించాలన్నారు. ఏ డివిజన్ నుంచి కూడా ఫిర్యాదులు రాకుండా చూడాలన్నారు. విధులకు హాజరుకాని కార్మికులను వెంటనే పనికి హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని అవసరమైతే హాజరు కాకపోతే తగిన చర్యలు చేపట్టాలన్నారు. డివిజన్లకు కేటాయించిన కార్మికులందరూ తప్పని సరిగా విధులకు హాజరు కావాలన్నారు. జటాయు వెహికిల్ సామర్థ్యాన్ని పెంచి రోడ్డు శుభ్రతపనులు మరింత సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. రోడ్డు స్వీపింగ్ మిషన్ల పని సమయాన్ని పెంచి నగరంలోని అన్ని రహదారులు శుభ్రంగా ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్, శానిటరీ సూపర్‌వైజర్లు, ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

# కర్షకునికి యూరియా కష్టం



**ప్రజాపక్షం/కల్లూరుః** కల్లూరు మండల పరిధిలోని చెన్నూరు,పెద్ద కోరుకొండి, చిన్న కోరుకొండి, పోచవరం గ్రామాలలో రైతు వేదికలు సొసైటీలు వద్ద మంగళవారం యూరియా కోసం కర్షకునికి కష్టం వచ్చింది. చాలీచాలని యూరియాతో ఈ తరుణంలో యూరియా వేసేందుకు రైతుకు అవసరాలు నిమిత్తం పంటకు వేసేందుకు యూరియా అందుబాటులో లేనందున వస్తుందని తెలుసుకొని తెల్లవారుజామున వేచి ఉండి ఆరు గంటలకే కూపన్లు అయిపోవడంతో నిరాశతో ఆగ్రహానికి గురై ఏఈఓ, ఏవో, సీఈఓ లపై వాగ్వాదానికి దిగారు. ఈ తరుణంలో పంటలకు సరిపోను యూరియా చల్లాల్సి ఉన్నందున రైతులు యూరియా వచ్చిందని తెలుసుకొని ఒకేసారి గుంపులతో, తోపులాటలు చేశారు. సాగు చేసిన పంటలకు చల్లేందుకు ఒక బస్తా ఎరువు కూడా దొరకటానికి కష్టంగా గగనంగా మారింది. యూరియా వేయకపోతే ఆశించిన దిగుబడి రాక పంట పెట్టుబడి నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని రైతుల పేర్కొంటున్నారు. జిల్లా స్థాయి అధికారులు, మండల స్థాయి అధికారులు ఆ క్రమ పద్ధతిలో రైతులను ఓదార్చే విషయమై ఎంత ప్రయత్నం చేసిన వినే అవకాశము లేకపోయింది. సొసైటీల వద్దకు ఎరువులు వస్తున్నాయని తెలుసుకొని తెల్లవారుజామునే చేరుకొని కూపన్లను తీసుకుంటున్నారు. చాలీచాలని ఎరువులు రావడం వల్ల సొసైటీలు వద్ద పోలీస్ బందోబస్తు మధ్య ఎరువులను పంపిణీ చేస్తున్నారు. మండల పరిధిలోని చెన్నూరు, పోచవరం, చిన్న కోరుకొండి,సొసైటీల వద్ద, పెద్ద కోరు కొండిలోని రైతు వేదిక వద్ద పోలీస్ బందోబస్తు మధ్య ఎరువుల బస్తాలను పంపిణీ చేశారు. చాలీచాలని ఎరువులు బస్తాల వలన మరోసారి వస్తాయని చెప్పడంతో వివాదం సద్దుమణిగింది. కల్లూరు ఎస్సై హరిత, సత్తుపల్లి రూరల్ సిఐ ముత్తులింగయ్య, ఏవో రూప, ఏఈఓ, వెంకట లీల, వెంకట్ ఆధ్వర్యంలో ఎరువుల బస్తాలను పంపిణీ చేశారు.

# ఆయుష్మన్ ఆరోగ్య మందిర్‌ను సందర్శించిన జిల్లా వైద్యాధికారిణి



**ప్రజాపక్షం/ బోనకల్ :** మండల పరిధి ముష్టికుంట్లలోని ఆయుష్మన్ ఆరోగ్య మందిర్‌ను జిల్లా వైద్యాధికారిణి డాక్టర్ బి.కళావతిభాయ్, డిపిఓ ఎం.దుర్గ మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. వర్షంకారణంగా దెబ్బతిన్న ముష్టికుంట్ల ఉప కేంద్రంను సందర్శించి చుట్టూ ఉన్న పరిసరాలను తనిఖీ చేశారు. నెల క్రితం వర్షం వల ఉప కేంద్రంలోకి వర్షం నీరు చేరటం ద్వారా ఉపకేంద్రంలోకి వెళ్లేందుకు కష్టంగా ఉందని, ఫర్నీచర్‌కూడా నీటిలో ఉండిపోయాయని, ఇంకా ఈ నీరు అక్కడ ఉండటం చూసి పంచాయతీ సెక్రటరీని వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ విషయం పై అధికారులు దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేయటం జరుగుతుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ స్రవంతి, సిహెచ్‌ఓ దానయ్య, పల్లదవఖానా మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రియాంక, సెక్రటరీ సైదులు, ఇతర ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

# డిప్యూటీ సిఎం భట్టిని కలిసిన మధిర ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రెస్‌క్లబ్



**ప్రజాపక్షం/ మధిర :** తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కను ఇటీవల నూతనంగా ఎన్నికైన మధిర ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రెస్ క్లబ్ కమిటీ మర్యాదపూర్వకంగా కలిసింది. మంగళవారం ఎర్రుపాలెం మండల పర్యటన అనంతరం సాయంత్రం మధిర క్యాంపు కార్యాలయానికి వచ్చిన డిప్యూటీ సిఎం భట్టిని ప్రెస్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు జివి, అరుణ్ ఆధ్వర్యంలో ప్రెస్ క్లబ్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. మధిరలో ప్రెస్ క్లబ్ కార్యాలయ ఏర్పాటుకు చొరవ చూపాలని, అర్హులైన జర్నలిస్టులందరికీ హెల్త్‌కార్డులు ఇవ్వాలని, అక్రిడేషన్లు ఇవ్వాలని, ఇందిరమ్మ ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరారు. దీనికి సానుకూలంగా స్పందించిన భట్టి మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ముందుగా నూతన ప్రెస్ క్లబ్‌కు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ గౌరవాధ్యక్షులు నాళ్ళ శ్రీనివాసరావు, కోశాధికారి కాకర్తపర్తి శ్రీనివాసరావు, ఉప కోశాధికారి శ్రీధర్, ప్రచార కార్యదర్శి అర్జున్, మహంకాళి శ్రీనివాసరావు, బాణాల శంకరాచారి, చారుగుండ్ల నర్సింహామూర్తి, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

# సీతారామ భూ సర్వే పనుల్లో వేగం పెంచాలి



**ప్రజాపక్షం/పెనుబల్లిః** సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ భూమి సర్వే పనుల వేగం పెంచాలని కల్లూరు డివిజన్ సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ ఆదేశించారు. మంగళవారం తహశీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి, రికార్డులను పరిశీలించి సర్వే వివరాలను సర్వేయర్ ను అడిగి తెలుసుకున్నారు. త్వరితగతిన సర్వే పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. నిర్దేశించిన పనుల కంటే 20 శాతం పనులు అధికంగా పూర్తి చేశామని తహశీల్దార్ సూర్యనారాయణ మూర్తి వివరించారు. ప్యాకేజ్ వన్ లో బయ్యనగూడెం, గౌరారం, చౌడవరం, మండాలపాడు, అడవి మల్లెల, బవన్నపాలెం, పెనుబల్లి, లింగగూడెం, కారాయి గూడెం, కొండ్రుపాడు తుమ్మలపల్లి, ప్యాకేజ్ 2 లో గౌడారం, పెనుబల్లి, తాళ్లపెంట, లింగగూడెం గ్రామాలలో రెవెన్యూ పరిధిలోని భూములు నిర్దేశించిన లక్ష్యాల కంటే అధికంగా సర్వేను నిర్వహించినట్లు తహశీల్దార్ సూర్యనారాయణమూర్తి, సర్వేయర్ లు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ కి వివరించినట్లు తెలుస్తుంది.

# నిబద్ధత గల నాయకురాలు అగర్త



**ప్రజాపక్షం/సత్తుపల్లిః** నిబద్దత గల నాయకురాలు అగర్త అని, ఆమె మరణం యూనియన్ కి భారీ నష్టమన్నారు ఏఐటియూసి జిల్లా ఉపాధ్యక్షులు నిమ్మటూరి రామకృష్ణ. మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో అంగనవాడి టీచర్ గా పనిచేస్తున్న బలవంతపు అగర్త (54) మంగళవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఏఐటీయూసీ నాయకులు ఆమె నివాసానికి చేరుకుని అంగనవాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో అగర్త పార్ధేహ దేహం సందర్శించి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం రామకృష్ణ మాట్లాడుతూ అగర్త సత్తుపల్లి ప్రాజెక్టులో ఏఐటియుసి యూనియన్ స్థాపించడానికి ప్రథమ సభ్యురాలని, ఏఐటీయూసీ సంఘం కొరకు అగర్త చివరి వరకు శ్రమించారన్నారు. ఆమె మరణం వారి కుటుంబ సభ్యులకే కాకుండా ఏఐటీయూసీ సంఘానికి తీరని నష్టమని రామకృష్ణ అన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి తడికమళ్ళ యోబు, ఏఐటియూసి మండల నాయకులు తాటి నాగేంద్ర, అంగన్వాడి వర్కర్స్ యూనియన్ నాయకురాలు విజయమ్మ, జంగం నాగేంద్ర, లక్ష్మి , పద్మ పాల్గొన్నారు.

# ప్రజా కవి కాళోజీ జయంతి



**ప్రజాపక్షం/ బోనకల్ :** బోనకల్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల నందు ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ జోనాతాన్ బాబు అధ్యక్షతన ప్రజా కవి కాళోజి నారాయణరావు 111వ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలుగు భాషా గొప్పదనం, ప్రత్యేక తెలంగాణ ఆవశ్యకతను ఆయన రచనల ద్వారా ప్రజలను చైతన్యపర్చిన మహా కవిఅని కొనియాడారు. ఆయన సేవలను గుర్తించిన తెలంగాణ ప్రభుత్వం ఆయన జయంతి రోజు తెలుగు భాషా దినోత్సవం నిర్వహించుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# న్యూవిజన్‌లో కాళోజీ జయంతి



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలోని న్యూవిజన్ పాఠశాలలో తెలంగాణ వైతాళికుడు కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఎండి అబాద్ అలీ తెలిపారు. తొలుత ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కాళోజీ నా గొడవ ద్వారా యాస ప్రాముఖ్యత చాటారన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అకాడమిక్ డైరెక్టర్ సిహెచ్ కార్తీక్, తెలుగు అధ్యాపక బృందం, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రణాళికాబద్ధంగా ఏదులాపురం అభివృద్ధి



-ప్రజలకు మౌలిక వసతుల కల్పన
-రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి
-ఏదులాపురం మున్సిపాలిటీలో
అభివృద్ధి పనులకు శంకుస్థాపన



**ప్రజాపక్షం/ ఖమ్మం రూరల్** : ఇప్పుడిప్పుడే అభివృద్ధి చెందుతున్న, కొత్తగా ఏర్పడిన ఏదులాపురం మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టనున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. మంగళవారం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని తెల్దారుపల్లి, మద్దులపల్లి లలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పర్యటించారు. తెల్దారుపల్లిలో రూ. 1.54 కోట్లతో నిర్మించనున్న బిటి రోడ్డు పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. మద్దులపల్లిలో రూ. 69 లక్షలతో నిర్మించిన సిసి రోడ్లను మంత్రి ప్రారంభించారు.ఈ సందర్బంగా మంత్రి మాట్లాడుతూ తెల్దారుపల్లి ప్రాంతానికి ప్రజా ప్రభుత్వం వచ్చిన 20 నెలల్లోనే రూ. 12.35 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. మద్దులపల్లి ప్రాంతానికి బిటి రోడ్డు, అంతర్గత సిసి రోడ్లు నిర్మించామన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేకపోయినా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామన్నారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ. 500 గ్యాస్ సిలెండర్, ఉచిత బస్సు ప్రయాణం వంటి కార్యక్రమాల ద్వారా మహిళలకు భరోసా కల్పించామన్నారు. దేశంలో ఎక్కడలేనివిధంగా రేషన్ ద్వారా పేదలకు సన్న బియ్యం సరఫరా చేస్తున్నామన్నారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిన రేషన్‌కార్డుల సమస్యలను ప్రజాప్రభుత్వం ఏర్పడిన వెంటనే పరిష్కరించి కొత్త కార్డులను పంపిణీ చేశామన్నారు. పేదలకు అండగా ఉండే కాంగ్రెస్ ప్రభుత్వం మొదటి విడతగా రాష్ట్రంలో 4.5 లక్షల ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేశామన్నారు. త్వరలో రెండవ విడత కూడా మంజూరు చేస్తామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి విడతల వారీగా ఇండ్లను అందిస్తామన్నారు. తెల్దారుపల్లిలో 24 మంది లబ్దిదారులకు ఇండ్ల స్థలాల పట్టాలు, మద్దులపల్లిలో 22 మంది లబ్దిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను మంత్రి అందజేశారు.ఈ కార్యక్రమంలో మద్దులపల్లి మార్కెట్ కమిటీ ఛైర్మన్ హరినాథ్ బాబు, ఆర్డీవో నర్సింహారావు, ఆర్అండ్‌బి ఈఈ పవార్, తహసీల్దార్ రాంప్రసాద్, అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల పోటీలో సిపిఐ



-ఎన్నికలకు పార్టీ శ్రేణులు సమాయత్తం కావాలి
-సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కర్నాటి బానుప్రసాద్

**ప్రజాపక్షం/నేలకొండపల్లి** : స్థానిక సంస్థల ఎన్నికల్లో భారత కమ్యూనిస్ట్ పార్టీ పోటీలో ఉంటుంది అని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కర్నాటి బాను ప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం సిపిఐ మండల కౌన్సిల్ మరియు ముఖ్య కార్యకర్తల సమావేశం ను కర్నాటి కృష్ణయ్య భవనం నందు కామ్రేడ్ బాగం నరసింహారావు అధ్యక్షులు గా నిర్వహించారు. ఈ సందర్బంగా అయినా మాట్లాడారు. కార్మిక, కర్షక, కష్టజీవుల పక్షాన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అనగారిన వర్గాల పక్షాన పోరాడేది ఎర్రజెండా అని అన్నారు. అధికారంలో ఉన్న లేకున్నా నిరంతరం ప్రజల పక్షాన నిలబడేది కమ్యూనిస్టు పార్టీ అని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు వచ్చినా పార్టీ శ్రేణులు తగు రీతిలో సమాయత్తం కావలని కోరారు. జిల్లా పార్టీ నిర్ణయం మేరకు పొత్తులు ఉంటాయని తెలిపారు. బీసీ రిజర్వేషన్ రాకుండా తమ రాజకీయ అవకాశవాదంతో కేంద్ర ప్రభుత్వం మోకలడ్డుతుందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లకు శాసనసభలో బిల్లు ఆమోదించిన రాజ్యాంగ సంస్థలను తమ జేబు సంస్థలతో వాడుకుంటూ బిల్లు ఆమోదం కాకుండా అడ్డుకుంటుందని తెలిపారు. .కాలేశ్వరం ప్రాజెక్టులో జరిగిన భారీ అవకతవకలపై విచారణ జరిపిన పిసిగోష్ నివేదిక బిఆర్ఎస్ అవినీతిని చర్యలు తీసుకునే అవకాశం ఉన్న మరింత పారదర్శకత కోసం సిబిఐ విచారణకు రాష్ట్ర ప్రభుత్వం కోరడం స్వాగతించాల్సిన విషయం అని అన్నారు. రైతులు యూరియా దొరకక తీవ్ర ఇబ్బందులు పడుతున్న క్రమంలో కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాన్ని అభాసపాలు చేయాలని లాలూచీ రాజకీయాలను మానుకోవాలని, రాష్ట్రానికి సరిపడా యూరియా వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఐ మండల కార్యదర్శి మారిశెట్టి వెంకటేశ్వరరావు, మండల సహాయ కార్యదర్శులు మల్లెబోయిన ఉపేందర్, మాళ్లోతు అయోధ్య, జిల్లా కౌన్సిల్ సభ్యులు కనకబండి సీతారాములు, మండల నాయకులు పాలపాటి అశోక్, చావా గణపతి, రాయల మాధవ్ రావు, పొలంపల్లి నారయణ, ఆలేటి మహేష్, మేకల పుల్లయ్య, కుంచం బిక్షం, బాలిన కృష్ణంరాజు, ఆనంతు పుల్లయ్య, పాలకుర్తి తిరపతిరావ, కాశయ్య, బాలిన నారయణ, చిలివేరు రేణుబాబు, వల్లాల కృష్ణ, బాలేబోయిన వేంకన్న, చేన్నబోయిన మల్లయ్య, తమ్మిశెట్టి మమతా తదితరులు పాల్గొన్నారు.

# పాలేరు చిన్నారులకు పిఎస్ఆర్ ట్రస్ట్ ఉచిత షూస్ పంపిణీ





**ప్రజాపక్షం/కూసుమంచి:**పాలేరు నియోజకవర్గంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న చిన్నారులకు ఉచితంగా షూస్ పంపిణీ కార్యక్రమానికి తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచనల మేరకు పీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ శ్రీకారం చుట్టింది. మంగళవారం కూసుమంచి మండలం నరసింహులగూడెంలో జరిగిన కార్యక్రమంలో మంత్రి స్వయంగా 1 నుండి 5వ తరగతి చదువుతున్న బాల బాలికలను షూస్ అందజేశారు. మిగిలిన ప్రాంతాల్లో ఆయా ప్రాంతాల కాంగ్రెస్ పార్టీ నాయకులు పంపిణీ నిర్వహించారు. కూసుమంచి మండలంలోని 62 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో 1700 జతల షూస్ పంపిణీ చేశారు. కొత్త షూస్ అందుకున్న చిన్నారులు ఆనందంతో కళకళలాడారు. ఈసందర్భంగా స్థానిక నాయకులు మాట్లాడుతూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఎల్లప్పుడూ పేదల అంటే మక్కువ చూపే నాయకుడుని, ఆయన సూచనల మేరకు పీఎస్ఆర్ ట్రస్ట్ తీసుకుంటున్న ఈ తరహా చర్యలు చిన్నారుల భవిష్యత్తుకు ఎంతో ఉపయోగకరంగా నిలుస్తాయని, ఒక చిన్న అవసరాన్ని తీర్చడం ద్వారా పిల్లల్లో చదువుపై ఆసక్తి పెంచడం మంత్రి ప్రత్యేకత అని, తల్లిదండ్రులకు వ్యయ భారాన్ని తగ్గించడంలో, చిన్నారులకు సౌకర్యం కల్పించడంలో పెద్ద సహాయమని, ఇలాంటి సేవా చర్యలు మరిన్ని జరగాలని ఆశిస్తున్నామని పేర్కొన్నారు.

# జీవధార హెర్బల్ ఆస్పత్రి మూసివేత



**ప్రజాపక్షం/భద్రాచలం** : పట్టణంలో ఎలాంటి అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న జీవధార హెర్బల్ ఆస్పత్రిని ఐటిడిఏ పిఓ ఆదేశాల మేరకు మూసివేసినట్లు అదనపు వైద్యాధికారి డా.సైదులు తెలిపారు. మంగళవారం కూనవరం రోడ్‌లోని శుభం ఫక్షన్ హాల్ సందులో ఇటలీ వైద్య విధానంతో వైద్యం చేస్తున్న ప్రైవేట్ క్లీనిక్ ఎటువంటి అనుమతులు లేవని పిఓ దృష్టికి వచ్చిందని, దీనిపై తగిన వివరాలు సేకరించాలని పిఓ ఆదేశించారని, ఐదేళ్లుగా అనుమతులు లేకుండా నడుస్తుందని తెలిందని, అనుమతులు లేని కారణంగా మూసివేసినట్లు చెప్పారు.

# ముఖ్యమంత్రి సహాయనిధి కార్యాలయాన్ని సందర్శించిన ఎమ్మెల్యే జారె



**ప్రజాపక్షం/దమ్మపేటః** హైదరాబాద్ తెలంగాణ సెక్రటేరియట్ ముఖ్యమంత్రి సహాయనిధి విభాగంలో అశ్వారావుపేట నియోజకవర్గం లోని అశ్వారావుపేట, దమ్మపేట, ములకలపల్లి, అన్నపురెడ్డిపల్లి, చండ్రుగొండ మండలాల నుంచి సీయంఆర్ఎఫ్ సహాయం కోసం వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారికి ఎమ్మెల్యే జారె ఆదినారాయణ అందజేశారు.

# కాళోజీ సేవలు మరవలేనివి



**ప్రజాపక్షం/నేలకొండపల్లి** : ప్రజా కవి కాళోజీ నారాయణరావు సేవలు మరవలేనివి అని నేలకొండపల్లి ఎంపీడీఓ యం. యర్రయ్య పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో కాళోజీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటం కు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కాళోజీ తన రచనలతో ఉద్యమానికి స్ఫూర్తి నింపినట్లు తెలిపారు. ప్రజలను చైతన్యం చేసేందుకు ఆయన సాహిత్యం ఎంతో పని చేసిందని అన్నారు. ఆయన పుట్టిన రోజు ను తెలంగాణ భాషా దినోత్సవం ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ కార్యాలయం సిబ్బంది"తో పాటు పలువురు పాల్గొన్నారు.

# చేపలకు మేతగా చచ్చిన కోళ్లు

## ప్రజల ప్రాణాలతో చెలగాటం



**ప్రజాపక్షం/దమ్మపేటః** మండలంలోని ముష్టిబండ పంచాయతీ మల్లారం గ్రామంలో ఉన్న వ్యవసాయ భూముల మధ్యన గుట్టు చప్పుడు కాకుండా కొందరు వ్యక్తులు చేపల చెరువు నిర్వహిస్తున్నారు. ఇంత వరకు బాగానే ఉంది. కాని డబ్బుమీద ఆశతో ప్రజలు ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. చేపల చెరువులో చనిపోయిన కోళ్లను ఆహారంగా వేస్తున్నారు. ఇన్ని రోజులు చేపల చెరువులలో కోళ్ల వ్యర్థాలు వాడతారని అందరికి తెలిసిన విషయమే. కానీ కొన్ని నెలల నుంచి మల్లారం గ్రామంలో చేపల చెరువులలో చనిపోయిన, కుళ్లిపోయిన కోళ్లను ఆహారంగా వేస్తున్నారనే సమాచారం తో అ ప్రాంతం లో కలకలం రేపింది. ప్రజల ఆరోగ్యం గురించి పట్టించుకోకుండా కేవలం వ్యాపార లాభాల కోసమే చనిపోయిన కుళ్లిన కోళ్లను చేపలకు ఆహారంగా వేయడం పై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. చేపల పెంపకం దారుణిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

# కవి వైతాళికుడు కాళోజీ



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం**: తెలుగు అక్షరాల దిగ్గజం, కవివైతాళికుడు కాళోజీ నారాయణరావు అని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పసుపులేటి వీరబాబు అన్నారు. కాళోజీ జయంతిని పురస్కరించుకుని మంగళవారం స్థానిక గ్రంథాలయంలో ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా వీరబాబు మాటాల్డుతూ భారదేశానికి ప్రసిద్ధి స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ రాజకీయ కార్యకర్త, సామాజి, సాహిత్య రంగాల్లో చేసిన కృషి ప్రసిద్ధి చెందాయన్నారు. భారతదేశంలో అత్యున్నత రెండవ పురస్కారమైన పద్మవిభూషణ్‌తో సత్కరించబడ్డారన్నారు. తెలంగాణ ప్రభుత్వం కాళోజీ జయంతిని తెలంగాణ భాషా దినోత్సవంగా సత్కరించిందన్నారు. నేటి యుతవతం కాళోజీ జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని పలు రంగాల్లో రానించాలని, మహిళలు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంధపాలకురాలు గుమ్మడి మణిమృధుల, సిబ్బంది,విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా సేవాలాల్ సేన ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**ప్రజాపక్షం/ఏన్కూరు** : మండల కేంద్రమైన ఏన్కూర్లో మంగళవారం సేవలాల్ సేన మండల కన్వీనర్ ధీరవత్ సందీప్ నాయక్ ఆధ్వర్యంలో సేవాలాల్ సేన 11వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. సేవాలాల్ మహారాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసిన అనంతరం సేవాలాల్ సేన జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు మూడ్ నాగరాజు నాయక్ పాల్గొని మాట్లాడుతూ ఏజెన్సీలో ఉన్నటువంటి గిరిజనులకు ఉద్యోగాలు ఇప్పించడంలో 10 రిజర్వేషన్ సాధించడంలో, తీజ్ పండుగను ప్రభుత్వ గుర్తింపులో అలాగే శీతల పండుగ సాంస్కృతి సాంప్రదాయాలను కాపాడుతూ సేవాలాల్ మహారాజ్ జయంతిని ఘనంగా నిర్వహిస్తూ, ట్యాంక్ బండ్ పై తీజ్ ఉత్సవాలు చేసినటువంటి ఘనత సేవాలాల్ సేనదే నని ఆయన అన్నారు. జాతికి ఎక్కడ ఆపద వచ్చినా అక్కడ సేవాలాల్ సేన ఉంటుందని, రాబోయే రోజుల్లో జాతి కోసం అహర్నిశలు కృషి చేస్తామని తెలిపారు. లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని కొంతమంది చేస్తున్న కుట్రలను తిప్పి కొట్టడంలో సేవాలాల్ సేన పాత్ర కీలకమైందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మాలోతు నరసింహ నాయక్, మనోజ్ నాయక్, రమణ, వాంకుడోత్ లక్ష్మణ్ నాయక్, వెంకటేష్ నాయక్, గుగులోతు రాజీవ్ నాయక్, గూగులోత్ రోహిత్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

- సిఎం రిలీఫ్‌ఫండ్, కల్యాణలక్ష్మీ పథకాలు పేదలకువరం
- కొత్తగూడెం ఎంఎల్‌ఏ కూనంనేని
- రు.44.28 లక్షల చెక్కులు లబ్ధిదారులకు పంపిణీ





**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** పేద వర్గాల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేస్తున్న పథకాలను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు అన్నారు. స్థానిక కొత్తగూడెం క్లబ్‌లో మంగళవారం రూ.44.28 లక్షల విలువుచేసే కల్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు అందించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ పేద వర్గాలు పథకాలను మరింత సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాల్సిన బాధ్యత అధికారులతో పాటు పౌరులపై ఉందన్నారు. ఐతే ఫండ్ మొత్తంలో కోతలు విధించి తక్కువ స్థాయిలో మంజూరీ చేయడం సరైంది కాదన్నారు. వైద్యం కోసం ఖర్చు చేసిన మొత్తంలో 75 శాతం బిల్లును ప్రభుత్వం చెల్లించాలన్నారు. పిల్లల పెళ్లిళ్ల కోసం కల్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ పంథకం ఎంతగానో సహాయ పడుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన తులం బంగారం పథకాన్ని సత్వరమే అమలు చేయాలని, అధికారంలోనికి వచ్చిన తర్వాత దరఖాస్తు చేసుకున్నవారందరికీ పథకాన్ని అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్రగిరి శ్రీనివాస్, సలిగంటి శ్రీనివాస్, కంచర్ల జమలయ్య, జిల్లా సమితి సభ్యులు దీటి లక్ష్మీ పతి, దారా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## కల్వర్టు పనులను పరిశీలించిన మేయర్



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం కార్పోరేషన్ పరిధిలోని కల్వర్టు నిర్మాణ పనులను మేయర్ పునుకొల్లు నీరజ పరిశీలించారు. మంగళవారం వైరా రోడ్డులో నిర్మిస్తున్న కల్వర్టు పనులను మేయర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా వీడియోస్ కాలనీ ప్రజలు డ్రైనేజీ సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు రూ. 1.5 కోట్లతో కల్వర్టు నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. పనులు వేగవంతంగా నాణ్యతా ప్రమాణాలు పాటించి పూర్తి చేయాలన్నారు. కల్వర్టు నిర్మాణం పూర్తయితే డ్రైనేజీ సమస్యకు పరిష్కారం లభిస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు మిక్కిలినేని నరేంద్ర, పోట్ల వీరేందర్, సురేష్, ఇంజనీరింగ్ అధికారులు, ఈఈ కృష్ణలాల్, డిఈ ధరణికుమార్, ఏఈ తేజ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా తెలంగాణ భాషా దినోత్సవం



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరం శ్రీనగర్ కాలనీలోని స్టెమ్‌స్పార్క్ రెజొనెన్స్ పాఠశాలలో తెలంగాణ భాషా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మంగళవారం ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలంగాణ భాషా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ కొండా శ్రీధర్‌రావు, కొండా కృష్ణవేణి లు మాట్లాడుతూ కాళోజీ తెలంగాణ ప్రాంత విలువైన సాహిత్యపు ఆస్తి అన్నారు. పుట్టుక నీది చావు నీది బ్రతుకంతా దేశానిదే అన్న కవి అన్నారు. కాళోజీని స్ఫూరిగా తీసుకుని నేటి తరం ముందుకు సాగాలన్నారు. తన కవితల ద్వారా తెలంగాణ యాసా, భాషాలను చూపిస్తూ అందరికీ అర్థమయ్యేలా సామాజిక చైతన్యాన్ని కలిగించిన ఉద్యమ కవి అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పివిఆర్ మురళీమోహన్, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా విద్యాధికారిగా విద్యాచందన



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** జిల్లా విద్యాధికారిగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లా విద్యావిభాగానికి చెందిన పరిపాలన, పర్యవేక్షణా,కార్యక్రమాలు, పాఠశాలల అభివృద్ధి, విద్యా ప్రమాణాల మెరుగు, ఉపాధ్యాయులు పర్యవేక్షణ వంటి అంశాలను ఆమె సమన్వయం చేయనున్నారు.

## ఈవిఎం గోదాముల తనిఖీ చేసిన కలెక్టర్



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం** ఆర్డిఓ కార్యాలయ ప్రాంగణంలో ఉన్న ఈవిఎం గోదామును జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ మంగళవారం తనిఖీ చేశారు. ఇందులో భాగంగా ఈవిఎం ప్యాట్లు ఉన్న గదిని, సిసి కెమోరా గదిలోని కెమోరాల పనితీరును పరిశీలించారు. అనంతరం ఆయన గోదాము పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచాలని, అనుమతి లేనిదే ఎవ్వరినీ లోనికి అనుమతించరాదని ఆదేశించారు. అనంతరం రిజిష్టర్‌లో సంతకం చేశారు. ఈ తనిఖీల్లో ఆయన వెంట సూపరింటెండెంట్ రంగ ప్రసాద్, పొలిటికల్ పార్టీ నాయకులు నోముల రమేష్, లక్ష్మణ్ అగర్వాల్,రాంబాబు, శ్రీనివాస్, సలీం, నవీన్, అశోక్ తదితరులున్నారు.

## మార్కెట్ కమిటీల సమస్యలను పరిష్కరించాలని వినతి



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** మార్కెట్ కమిటీల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు రాష్ట్ర వ్యవసాయ మార్కెట్ కమిటీల ఛైర్మన్ ఫోరం కోరింది. మంగళవారం హైదరాబాద్‌లో మంత్రి నివాస సముదాయంలో రాష్ట్ర వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ల ఫోరం సభ్యులు మంత్రి తుమ్మల నాగేశ్వరరావును మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందించారు. మార్కెట్ కమిటీల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపాలని విన్నవించారు.

## ప్రజాకవి కాళోజీ సేవలు చిరస్మరణీయం

-అదనపు కలెక్టర్ విద్యాచందన



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ప్రజాకవి కాళోజీ సేవలు చిరస్మరణీయమని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన అన్నారు. ఆయన జయంతిని పురస్కరించుకుని మంగళవారం ఐడిఓసిలో కాళో జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం మాట్లాడుతూ సమాజిక ఉద్యమకారునిగా, ప్రజా చైతన్య వేత్తగా కాళోజీకి తెలంగాణలో ప్రత్యేక స్థానం ఉందన్నారు. భాషా వారసత్వాన్ని కాపాడుకోవడం ప్రతీ ఒక్కరిక బాధ్యతగా భావించి కాళోజీ చూపిన దారిలో నడవాలని పిలుపునిచ్చారు.

**భద్రాచలంలో...**

ఐటిడిఏలో కాళోజీ జయంతి జరిపారు. ఏపిఓ జనరల్ డేవిడ్ రాజ్ కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. తెలంగాణ జీవిత చలన శీలి కాలోజీ అన్నారు. అన్యాయాన్ని ఎదురించే వాడే ఆరాధ్యుడని చెప్పన దిశాలి అన్నారు. కాళోజీ స్ఫూర్తితో అధికారులు గిరిజనులకు మంచి సేవలు అందిచి పేరు తెచ్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా కార్యాలయల సిబ్బంది పాల్గొన్నారు.

## త్రివేణిలో కాళోజీ జయంతి వేడుకలు



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలోని త్రివేణి పాఠశాలలో కాళోజీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మంగళవారం కాళోజీ జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి మాట్లాడుతూ పుట్టుకు నీది చావు నీది బ్రతుకంత దేశానిదే అంటూ తెలంగాణ మాండలికంలో చక్కని కవితలు అల్లిన విశ్వ మానవ కవి కాళోజీ అన్నారు. తెలుగు సొగసును, మాతృభాషలోని తీయ్యదనాన్ని ప్రతి ఒక్కరూ ఆనందించాలని, ప్రపంచంలో ఎన్ని భాషలు ఉన్న మాతృభాషకు ఉన్న ప్రత్యేకత తరగదన్నారు. ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ పరభాష జ్ఞానాన్ని సంపాదించి ఏ ప్రాంతంలోనైనా జీవించిన మన మాతృభాష మూలాలను మరువరాదన్నారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, కవిత పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కృష్ణవేణి త్రివేణి విద్యా సంస్థల డైరెక్టర్ యార్లగడ్డ వెంకటేశ్వరరావు, సిఆర్‌వో కాట్రగడ్డ మురళికృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ స్వప్న, ముస్తఫా, చార్లెస్, సందీప్, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐ కార్యకర్త శీలం రాధాకృష్ణ మృతి



**ప్రజాపక్షం/ చింతకాని :** మండల పరిధిలోని కొదుమూరు గ్రామానికి చెందిన సిపిఐ కార్యకర్త శీలం రాధాకృష్ణ (38) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. మృతునికి భార్య, కుమారుడు ఉన్నారు. రాధాకృష్ణ సిపిఐ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనే వారు. మృతివార్త తెలిసిన వెంటనే సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కొండపర్తి గోవిందరావు రాధాకృష్ణ మృతదేహంపై అరుణ పతాకాన్ని ఉంచి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రవికుమార్, సిపిఐ నాయకులు కొల్లి సీతయ్య, సింగారపు సత్యనారాయణ, శ్రీనివాస్, దొబ్బల వెంగళరావు, నక్కనబోయిన సుజాత, నారపోగు హేమ, కాంగ్రెస్ నాయకులు పెంట్యాల అప్పారావు లు ఉన్నారు.

## ఘనంగా పరిశుద్ధ మరియమ్మ జన్మదిన వేడుకలు




**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** ప్రతి ఏడాది సెప్టెంబర్ 9న పరిశుద్ధ మరియమ్మ జన్మదిన వేడేకలను అంగరంగ వైభవంగా సోమవారం నిర్వహించుకోవడం జరిగిందని ఆర్సియం పునీత పౌల్, పేతురు దేవాలయ విచారణ గురువు తీరు హృదయ సభ గురువులు సిద్దెల జేసు ప్రసాద్, ఉప గురువు వరుణ్ అన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సెప్టెంబర్ 9న సర్వ మానవాళికి పవిత్రురాలైన పరిశుద్ధ మరియమ్మ, లోకరక్షకుడైన ఏసుప్రభుకు పవిత్ర జన్మనిచ్చిన తల్లి పరిశుద్ధ మరియమ్మ, మధ్యస్థ ప్రార్థన సహాయంతో భక్తుల కోరికలను నెరవేర్చి చిన్నారి పిల్లలకు దర్శనమిచ్చి పలు పట్టణ ప్రాంతాల్లో వెలసిన ఆరోగ్యమాత, వేలంగిని మాతగా కొనియాడటం క్రైస్తవ భక్తుల విశ్వాస ఘట్టమన్నారు. ప్రతి ఏటా మే, అక్టోబర్ మాసంలో పూజిత మరియమ్మ జపమాట మాసంగా, శ్రీ సభ నియమించిన జపమాట కార్యక్రమాలను సైతం ప్రపంచ వ్యాప్తంగా ఘనంగా నిర్వహించడం జరుగుతుందని, విచారణలోని, క్రైస్తవభక్తులు, విశ్వాసులు, కుటుంబాల సమేతంగా ప్రత్యేక పరిశుద్ధ మరియమాత జపమాల, పూజిత మాసంగా, నిష్కలంక పరిశుద్ధ మరియమ్మ జనపమాలను జపించడం ఆనవాయితీ వస్తుందన్నారు. పరిశుద్ధ మరియమ్మ పలు ప్రాంతంలోని అనేక మంది చిన్న పిల్లలకు దర్శనమిచ్చి, గ్రామాల ప్రజల స్థితిగతులను, అద్భుతాలను, స్వస్థతలను కేవలం 53 పూసల జపమాలతో అద్భుతాలు చేసి, ఆరోగ్యమాతగా ఇహపర లోకంలో వెలిసిన పరిశుద్ధ మరియమ్మ మాత్రమే అని కొనియాడారు. ఈకార్యక్రమంలో డీఎస్ఎస్ సిస్టర్ విమల కాన్వెంట్ సుపీరియల్ ప్రశాంత, దామరిస్, ప్రిన్సిపాల్ మహిత, జ్యోతిర్మయి యానిమేటర్ పరమ ప్రభాకర్, కిరణ్, సంఘ పెద్దలు నాగేశ్వరరావు, మరియదళం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## ఆది కర్మయోగి కార్యక్రమంపై శిక్షణ




**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** ఆది కర్మయోగి కార్యక్రమంపై రఘునాథపాలెం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శిక్షణ నిర్వహించారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని మల్లేపల్లి, దారెడు, ఈర్లపుడి గ్రామ పంచాయతీల కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు, వివోఏలు, ఆశా కార్యకర్తలకు రెండు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడివో అశోక్‌కుమార్ మాట్లాడుతూ జన జీవనానికి దూరంగా ఉండే గిరిజనుల్లో చైతన్యం తెచ్చేందుకు ఆది కర్మయోగి కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తుందన్నారు. గిరిజన సంక్షేమ శాఖ డిడి విజయలక్ష్మి కార్యక్రమానికి సంబంధించి కార్యక్రమ ఉద్దేశాన్ని సిబ్బందికి వివరించారు. ఈ కార్యక్రమంలో బంజరా సేవా సమితి ఎన్‌జీవో జిల్లా కన్వీనర్ బస్కీనాయక్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.